# కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక



సెప్టెంబర్ 2011

# కొొత్తపల్లి తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక - సెప్టెంబరు 2011

**మూలం: http://kottapalli.in/2011/09/welcome**

**సంపాదకులు:** నారాయణ

**ముఖచిత్రం:** వీరాంజనేయులు

**అక్షర కూర్పు :** *కొత్తపల్లి*

## ముద్రిత ప్రతి వెల: రూ. 20/-

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

**కాపీరైటు:** ఈ పుస్తకంలోని ఏ అంశాన్నైనా ఎవరైనా తమ వాణిజ్యేతర కార్యకమాలలో పూర్తిగా ఉచితంగా, స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. కేవలం ఆయా రచయితలకు, కొత్తపల్లి పత్రికకు వాటిని ఆపాదిస్తే సరి. వివరాలకు చూడండి: http://www.creativecommons.org వారి non-commercial, share alike license.

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

**ఫోను: 08559 240222, 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in**




# విషయ సూచిక

గురుపూజ..సంపాదకీయం...1

**ధారావాహిక**

నీతి చంద్రిక 23.. చిన్నయ సూరి...4

**పిల్లలు రాసిన కథలు**

కాకి-కోకిల..అశ్విని...9

అందరికోసం..అనన్య...13

కున్ని ముత్తు..స్టీఫెన్...15

నాకథ..హర్ష...18

ఎవరికీ చెప్పద్దు..వినయ్...20

బొజ్జ దేవుడు.. ప్రగతి...24

చింతచెట్లు..సతీష్...28

**అనువాద కథలు**

ఆకలి దప్పులు...పార్వతి...38

కొత్తబడిలో..సైరినా...40

ధర్మదీక్ష...బౌద్ధకథ...43

చలికాలం...పాలీ...46

అన్నదమ్ములు..పర్తాప్...49

పులి-మనిషి..రామానుజన్...52

**అవీ-ఇవీ**

పొడుపు కథలు...రామచంద్ర, ప్రగతి...30

కార్టూన్ కథ: దాహం తీరాక.. అనురాగ్...31

బొమ్మకు కథ రాయండి, స్పందన...32,33

చిలిపిప్రశ్నలు...మూర్తి...37

పదరంగం-7..దేవి...58

సమీక్ష...మాలతి...59

**పాటలు**

తరలిపో.. సూరి కుమారస్వామి..61

టిక్ టిక్ టిక్... జైసీతారాం...63



# గురుపూజ

నీకు జాన పళ్ళు తెలుసా? పరికి పళ్లు? పులికాయలు? వాక్కాయలు? రేగుపళ్ళ పచ్చడి ఎలా చేస్తారో తెలుసా?

ఈత కొట్టటం, చిల్లాంకట్టె ఆడటం వచ్చా?

బొంగరానికి తాడుకట్టి చతాల్మని వదిలితే అది నేలమీద పడి గుక్కపట్టి తిరిగేలా చేయటం వచ్చా? అట్లా తిరుగుతున్నదాన్ని తాడుతో అలాగే ఎత్తి అరచేతిమీద పెట్టుకొని ఆడిస్తూ ఎగరటం?

వంద జానల దూరంలో ఉన్న తెల్లగోలీని నీ నల్ల గోలీతో ఠకాల్మని కొట్టి, ఆ తెల్లగోలీ పోయి గుంతలో పడేట్లు చెయ్యటం వచ్చా? గాలిపటాలు ఎగరెయ్యటం?

ఎన్నిసార్లు గాలికొట్టినా సైకిలు ట్యూబులోగాలి నిలవకపోతే ఏం చెయ్యాలో తెలుసా? ఏ కొంచెం వెనక్కి తొక్కినా సైకిలు చైను పడిపోతుంటే ఏం చెయ్యాలో? సైకిలు టైరుకి గటర్ పెట్టుకోవటం, వాల్వ్ ట్యూబు మార్చుకోవటం వచ్చా?

మట్టినేలని పైపైన ఊడ్చి, కళ్ళాపు చల్లి, అది ఆరకముందే ముగ్గు వెయ్యటం వచ్చా?

నువ్వు వేసుకునే చొక్కా జిప్పు పైకిలాగినా తెరుచుకుంటూనే ఉంటే ఎలా బాగు

చేసుకోవాలో తెలుసా?

పాము కరిస్తే వెంటనే ఏం చెయ్యాలి? కుక్క కరిస్తే? వేరే ఏమైనా జంతువులు? దెబ్బ తగిలి రక్తం కారుతుంటే దాన్ని ఆపేందుకు ఏం చెయ్యాలి? అకస్మాత్తుగా జ్వరం వచ్చేస్తే ఏం చెయ్యాలి?

ఇటుకలతో గోడ కట్టటం వచ్చా, నీకు? సిమెంటులో ఇసుక వేసి, నీళ్ళు కలిపి మసాలా చెయ్యటం వచ్చా? వెదురు చీల్ని బద్దలు చెయ్యటం? బంకమట్టిని పిసికి మట్టి గురుగులు, వినాయకుళ్ళు చేయటం వచ్చా?

పాలు పితకటం వచ్చా? పాడైపోయిన హెలికాప్టరు బొమ్మలోంచి మోటారును పీకి, దాంతో స్టీమరును నడిపించటం?

కొమ్మలు నరకటం వచ్చా, నీకు? గునపంతో గుంతలు త్రవ్వటం, పారతో గెనాలు చెక్కటం, చేదబావిలోంచి నీళ్ళు చేదటం, హ్యాండ్‌పంప్‌లో నీళ్ళు కొట్టటం?

సూదిలోకి దారం ఎక్కించటం వచ్చా? పేకముక్కలతో మేడలు కట్టటం? కాయితాలతో అద్భుతాలని సృష్టించటం?

గులకరాళ్ళని ఎగరేస్తూ అచ్చంద కాయలు ఆడటం వచ్చా?


ఇవన్నీ మన మనసును, చేతుల్నీ కలిపే అంశాలే. పైకి మామూలుగాను, అతి సాధారణంగాను కనబడ్డా, వీటిలో మన వ్యక్తిత్వాలను మలచే జీవశక్తి దాక్కొని ఉంది.

ఈ జీవశక్తి పట్టణాలలో ఉంటున్న పిల్లలకు అందటం లేదు, కొంత కాలంగా.

పిల్లలందరికీ ఇవి అందాలని తపిస్తున్న పెద్దలు ఎంతమందో! వాళ్ళందరికీ నమస్కారాలు.

గురుపూజోత్సవ శుభాకాంక్షలతో,

కొత్తపల్లి బృందం.



# నీతి చంద్రిక

## 23 వ భాగం


*సింహం, ఎద్దు భీకరంగా పోరాడుతూ ఉండగా నక్కలు చుట్టూ చేరి ముచ్చటించుకుంటూ ఉంటాయి. కరటకుడు దమనకుడికి వర్తకుల కథను చెబుతుంటుంది. ఇంద్రపాలితుడు దాచుకున్న ఆరు బారువుల ఇనుమునూ ఎలుకలు తినేశాయంటాడు మిత్రుడు... ఇక చదవండి, నీతిచంద్రిక మిత్రభేదంలో చివరి అంకం...*

*మూలం: పరవస్తు చిన్నయ సూరి* *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ.*

ఒకరోజు ఇంద్ర పాలితుడు ధనగుప్తుడితో ముచ్చట్లాడుతూ ఉండగా వీధిలో "పండ్లమ్మా పండ్లు!" అని పండ్లమ్ముకునేవాడు ఒకడు అరిచాడు. ధనగుప్తుడి కొడుకు, చిన్నవాడొకడు, కాళ్ళ గజ్జెలు ఘల్లు ఘల్లుమంటుండగా తప్పటడుగులు వేస్తూ వచ్చి గునుస్తూ, ఏడుస్తూ తండ్రిని పట్టుకొని లాగుతూ, పండ్లు కొనిమ్మని మారాం చేయటం మొదలుపెట్టాడు.

అప్పుడు ఇంద్రపాలితుడు వాడిని

చంకనెత్తుకొని, "నా తండ్రివిగా, నాయనా, ఏడవకు. నేను నీకు పండ్లు కొనిస్తాను, రా" అని వాడిని చంకనెత్తుకొని, పండ్లవాడిని వెంబడిస్తున్నట్లు గబగబా బయటికి పోయాడు.




తర్వాత ఆ పిల్లవాడిని దూరంగా తీసుకుపోయి ఎక్కడో ఒకచోట దాచి, నిద్రపుచ్చాడు. ముఖంలో దు:ఖంతో, గబగబా, ఒంటరిగా వెనక్కి వస్తున్న ఇంద్రపాలితుడిని చూసి ధనగుప్తుడు "ఏమైంది, పిల్లవాడు ఏడి?!" అని అడిగాడు.

అప్పుడతను ఏడుపు గొంతుతో "నేనేం చేసేది! చంకలోఉన్న బిడ్డని క్రిందికి దించి పండ్లు బేరమాడటం మొదలు పెట్టానా? ఇంతలో ఎక్కడినుండి వచ్చిందో, ఓ పాడు గ్రద్ద, బిడ్డని ఉన్నవాడిని ఉన్నట్లు తన్నుకుపోయింది!" అన్నాడు.

ధనగుప్తుడికి ఎక్కడలేని ఆవేశం ముంచుకొచ్చింది. చేతితో రొమ్ములు చరచుకొంటూ "ఒరేయ్! ఎంత పాపానికి ఒడిగట్టావురా? సొమ్ముకు ఆశపడి ఇంత సాహసం చేస్తావా? అంత లేత పిల్లవాడి ప్రాణాలు తీసేందుకు నీకు మనసెలా వచ్చిందిరా? నీకు చేతులెలా వచ్చాయి? మిత్రద్రోహివి కదరా, నువ్వు! అంత బిడ్డని గ్రద్ద ఎత్తుకెళ్తుందా? ఎవరైనా నమ్ముతారా, ఈ మాటను?" అని దు:ఖంతోటీ, కోపంతోటీ పళ్ళు పటపటా కొరికాడు. "కానీరా! సొమ్ము దక్కిందనుకోకు. ఇదిగో, నీచేత క్రక్కిస్తాను చూడు" అని వెంటనే లేచివెళ్ళి న్యాయస్థానంలోఫిర్యాదు చేశాడు.

న్యాయాధిపతులు ఆశ్చర్యపోయి ఇంద్రపాలితుడిని పిలిపించి, 'ఇది నిజమేనా?' అని అడిగారు. అవునన్నాడు వర్తకుడు. వాళ్ళు నవ్వి "ఓయీ! నువ్వు చెబుతున్న ఈ

కారణం ఏదోగాని, మేం ఇదివరకు ఎన్నడూ విననిది, చూడనిది. మాకు చాలా ఆశ్చర్యం వేస్తున్నది. అంత పెద్ద బిడ్డడిని గ్రద్ద ఎత్తుకెళ్లటమేమిటి?" అని అడిగారు.



"అయ్యా! ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. మిత్రుడుగదా అని నమ్మి, అరవై బారువుల ఇనుమును ఇతని ఇంట్లో దాచుకొని పోయాను. ఆ లోహాన్నంతా ఎలుకలు తినేశాయట! ఇనుమును తినే ఎలుకలు ఉన్నచోట, పసిబిడ్డను గ్రద్దలు ఎత్తుకొని పోవటంలో ఆశ్చర్యం ఏమున్నది?" అన్నాడు ఇంద్రపాలితుడు వాళ్లతో.

అది విన్న అధికారులకు వాస్తవం అర్థమైంది. వాళ్ళు ఇనుమును, పిల్లవాడిని తెప్పించి, ఇంద్రపాలితుడికి ఇనుమును, ధనగుప్తుడికి పిల్లవాడిని ఇప్పించారు. మిత్రుడిని మోసం చేసి సొమ్మును కాజేసినందుకుగాను ధనగుప్తుడికి జరిమానా విధించారు.

కరటకుడు దమనకుడికి ఈ కథని చెప్పి, అతన్ని చాలా చీవాట్లు పెట్టాడు.

సరిగ్గా ఆ సమయానికి సింహరాజు కోపం నసాళానికి అంటింది. దాని మెడమీది వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. ఆ కోపంలో అది 'కోపం అంటే ఇట్లా ఉంటుందా!' అన్నట్లు ఎర్రబారింది. దిక్కులన్నీ పిక్కటిల్లేట్లు అది ఒక్క పెట్టున గర్జించి చెంగున ఎగిరి సంజీవకుడి ప్రక్కల్లోఒక్కతను తన్నింది. ఆ తాపుకు కాపుకోలేక, ఎద్దు కాళ్లకి నాడాలు కొట్టేటప్పుడు క్రిందపడినట్లు, గుభిల్లున ఒక ప్రక్కకు తూలి పడింది. మరుక్షణం సింహం దాని మీదికి దూకి, ముందుకాళ్లతోదాని తలను ఒత్తిపట్టి, మెడను కొరికి నెత్తురు గుటగుటా త్రాగింది. సంజీవకుడు ఇక పైకి లేవలేదు. శత్రువును అలా అంతం చేశాక, సింహం కోపం చల్లారింది. ఊపిరి యథాస్థితికి

వచ్చాక, అది ప్రశాంతంగా వెనక్కి తిరిగి తన నివాసానికి పోయింది.



వెనక్కి చేరనైతే చేరింది గానీ, దాని మనస్సు పశ్చాత్తాపంతో దహించుకు పోసాగింది. తనకు ఎదురు వచ్చిన కరటకుడినీ, దమనకుడినీ చూసి అది -"అయ్యో! ఎంత చెడ్డపని చేశాను! కాపాడి, పోషించి ప్రజలను సంతోషపెట్టేవాడిని 'రాజు' అంటారు గాని, నాలాంటి వాడికి 'రాజు' అనే బిరుదు ఏం నప్పుతుంది?! అయ్యో!ముందు చూపు లేనివాడిని! కనుకనే చేతులారా సంజీవకుడిని చంపుకున్నాను. ఎంతటి విషవృక్షం అయినా తానై పెరుగుతుంది తప్ప, తన కాండాన్ని తానే నరుక్కోదు. తెలిసో తెలీకో, సేవకుడెవరైనా ఒక తప్పు చేస్తే, నయానో భయానో వాడి తప్పు వాడే ఒప్పుకునేటట్లు చేసి, ఆపైన వాడిని ఊరికే వదిలెయ్యాలి. ఆ తర్వాతకూడా వాడు అదే తప్పును కొనసాగిస్తే వాడిని మన శక్తి కొద్దీ అణచివెయ్యాలి. అంతే తప్ప, ఎక్కువ కోపాన్ని కనబడనివ్వరాదు. మన అసహనం బయట పడితే సేవకులకు మన ఆయువుపట్టు దొరుకుతుంది. దానివల్ల మనకే కష్టం వాటిల్లుతుంది. ఇందులో వేరే అనుమానం ఏమీ లేదు. ఎంత కష్టకార్యాన్నైనా సాధించవచ్చు గానీ, సరైన సేవకుడిని సంపాదించటం సులభం కాదు. అది అంతా ఒక ఎత్తు- దానిని అటు ఉండనివ్వండి. నేను చేసిన ఈ పని వల్ల, జీవించి ఉన్నంతకాలమూ చెరగని అపకీర్తి నా పాలబడింది. ఇప్పుడు నేను ఏం చేయను?" అని చేతులు ముడుచుకొని, తలవంచుకొని, నేలచూపులు చూసింది.

అప్పుడు కరటకం అన్నది- "మహారాజా! శత్రువును అంతంచేసి, ఆపైన తమరు ఇంతగా బాధపడటం తగదు. రాజన్నవాడు తనకు

కీడు తలపెట్టిన వారినెవరినైనా సరే, వదిలిపెట్టక శిక్షించాలి' అని నీతి తెలిసిన పెద్దలు చెబుతుంటారు. నేరం చేసిన వాడిని క్షమించి వదిలిపెట్టటం అన్నది తపస్సు చేసుకునే మునులకు సరిపోతుందేమో గాని, రాజులకు అది మేలుగూర్చదు. సింహాసనంమీది ఆశతో, రాజ్య కాంక్షతో ప్రవర్తించే దుష్టులకు మరణమే దండన; వేరే శిక్షలు వాళ్లకు చాలవు. దీన్ని అందరూ అంగీకరిస్తారు" అని.

అది ఇలా చాలా సేపు మాట్లాడాక పింగళకుడి మనస్సు చల్లబడ్డట్లైంది. అది సంతోషంగా మళ్ళీ తన సింహాసనం ఎక్కి కూర్చున్నది. దమనకుడు కూడాచాలా సంతోషపడి, "మహారాజా! మీకు మేలు కలగాలి! మీవల్ల ఈ లోకానికి మేలు కలగాలి!" అని ఉల్లాసపరచే మాటలు మాట్లాడింది. ఆపైన ఆ నక్కలు అన్నీరాజాశ్రయంలో సుఖంగా కాలం గడిపాయి.

-అని మిత్రభేదాన్ని పూర్తిగా చెప్పిన విష్ణుశర్మ," చూశారుగదా! స్నేహితుల మధ్య పోట్లాటలు ఎలా తలెత్తుతాయో! దీన్ని అర్థం చేసుకొని, మీరు మీ శత్రువుల పట్ల సరైన వైఖరిని అవలంబించండి" అన్నాడు, రాజకుమారులతో. మిత్రభేదాన్ని జాగ్రత్తగా విన్న రాజకుమారులు చాలా సంతోషపడ్డారు.

(నీతి చంద్రికలో పరవస్తు చిన్నయ సూరి రచించిన 'మిత్రభేదం' అనే రెండవభాగం ఇంతటితో ముగిసింది.)

**మీకు తెలుసా?**

పరవస్తు చిన్నయసూరి నీతిచంద్రికను తెలుగు చేయటం మొదలైతే పెట్టారు గానీ, ఆయన దాన్ని ముగించలేకపోయారు: మిత్రలాభం, మిత్రభేదం తో ఆయన ఆగిపోవాల్సి వచ్చింది! అటు తర్వాత మిగిలిన రెండు భాగాలు- విగ్రహం, సంధి- వీటిని కందుకూరి వీరేశలింగం గారు ఆంధ్రీకరించారు. ఆంధ్ర మహాభారతాన్ని ముగించిన తిక్కనను తలపించారాయన- అలా ఆయనకు 'గద్య తిక్కన' అని పేరు వచ్చింది!

వీరేశలింగంగారు వ్రాసిన విగ్రహాన్ని వచ్చేమాసంనుండీ కొత్తపల్లిలో చదవండి!



# కాకి-కోకిల



*రచన: బి.అశ్వని, 7 వతరగతి, విజ్ఞమ్‌స్కూల్, గుడిపాల, చిత్తూరుజిల్లా.*

ఒక పెద్ద మామిడిచెట్టు మీద ఒక కాకి, ఒక కోకిల నివసిస్తూ ఉండేవి. చాలా కాలంగా మంచి స్నేహితులు అవి. కోకిల తన గుడ్లను కాకి గూట్లోనే పెట్టేది. ఒకవైపున కాకి వాటిని పొదుగుతుంటే, కోకిల మాత్రం ఆ చుట్టుప్రక్కల పాటలు పాడుకుంటూ తిరిగేది.

ఒకరోజున బాటసారి ఒకడు అటువైపుగా పోతూ ఉంటే, చీకటిపడింది. దాంతో అతను ఆ రాత్రిని చెట్టు క్రిందే గడుపుదామని అనుకున్నాడు. ఆ సమయంలో కోకిల పాట పాడటం మొదలు పెట్టింది. ఆ పాట వింటూ చల్లగా హాయిగా నిద్రపోయాడు బాటసారి.

తెల్లవారుతూనే కాకి నిద్రలేచింది. 'కావ్! కావ్!' అని గట్టిగా పాట పాడటం మొదలుపెట్టింది. క్రింద నిద్ర పోతున్న బాటసారి ఆ పాట విని గబుక్కున

నిద్రలేచాడు. కొంచెం చిరాకుగా లేచి నిలబడి, అటూ ఇటూ చూశాడు. తొందర తొందరగా నడచుకొని వెళ్లిపోయాడు.


అతను అలా హడావిడిగా వెళ్తుండటం చూసింది కోకిల. "ఎందుకు కాకమ్మా, ఆ బాటసారి తెల్లవారు జామునే వెళ్లిపోతున్నాడు?" అని అడిగింది కాకిని.

"అతను నీ పాట విని రాత్రంతా హాయిగా నిద్రపోయాడు, అది నాకు నచ్చలేదు. అందుకని ప్రొద్దునే నేను పాడి, వాడిని నిద్రలేపి పంపేశాను. అందరూ నిన్నే మెచ్చుకొంటారు; నన్ను అసహ్యించుకొంటారు. అందుకే నేను అలా చేసేది! నువ్వంటే నాకు అసూయ. అందుకే నేను పాట పాడాను; ఇప్పుడు నీ గుడ్లను కూడా పాడుచేస్తాను" అని కాకి అరిచింది గట్టిగా.

"ఎందుకు అక్కా, అలా అరుస్తావు? ఆ బాటసారి వెళ్ళిపోయాడనే కదా, నువ్వు నన్ను, నా గుడ్లను అస్యహించుకొంటున్నది? సరే, కానివ్వు. నేను వెళ్ళి ఆ బాటసారినే అడుగుతాను- అతను ఎందుకు చికాకు పడ్డాడో!" అని కోకిల బాటసారిని వెతుక్కుంటూ పోయింది.

దూరంగా నడాచుకొంటూపోతున్నాడు బాటసారి. కోకిల ఎగురుకుంటూ అతని దగ్గరకు వెళ్ళి- "అయ్యా! కాకి పాట పాడితే మీరు అక్కడ నుండి వెళ్ళిపోయారట, ఎందుకు? మీరు తనని అవమానించారని నొచ్చుకున్నది కాకి. అది ఇప్పుడు నన్ను, నా గుడ్లను అసహ్యించుకుంటున్నది" అన్నది.

"అయ్యో అలాగా! నేను మాట్లాడతాను ఆగు, కాకితో" అని బాటసారి వెనక్కి తిరిగి చెట్టు దగ్గరకెళ్ళాడు.



ముఖం ముడుచుకొని కూర్చున్న కాకితో

అతను అన్నాడు- "కాకమ్మా! నన్ను క్షమించు. నిజం చెప్పాలంటే కోకిల గొంతు చాలా బాగా వుంటుంది, నీ గొంతు అంత బాగుండదు. అందుకే నేను నీ పాట వినబడగానే అక్కడి నుండి లేచి వచ్చేసాను.

అయినా మీరు ఇద్దరూ చాలా మంచి స్నేహితులని అందరూ అంటుంటే విన్నాను. అట్లాంటి మీరు గొడవ పెట్టుకున్నారా? నీ గొంతు బాగుండదు; కోయిల బాగా పాడుతుంది- అయితే మాత్రం ఏమిటట? కేవలం గొంతు బాగున్నంత మాత్రాన అది గొప్పదయిపోతుందా? దానికసలు పిల్లల్ని పొదగడమే తెలియదు గదా!? నువ్వే లేకపోతే దాని గతి ఏమికాను? ఎవరి గొప్పవారిది. దాని పాట విని నువ్వు ఆనందించాలి. తన పిల్లల్ని నువ్వు పొదుగుతున్నందుకు అది సంతోషించాలి!" అని.

బాటసారి మంచి మాటలకు కాకి ముఖం వికసించింది. 'అవును కదా, నేనేంటి ఇంత గొడవ చేశాను?' అనుకున్నదది.

ఆనాటి నుండి కోకిల పాటలంటే కాకికి ఇష్టం; తన గుడ్లను చక్కగా పొదిగే కాకి అంటే కోకిలకు ఇష్టం!




టీచర్: మనం ప్రాణాలతో బతకడానికి ఆక్సిజన్ అవసరం కదా! దీన్ని 1773వ సంవత్సరంలో కనిపెట్టారు.
విద్యార్థి: అమ్మయ్య టీచర్, నేను 1773 తర్వాత పుట్టినందుకు సంతోషిస్తున్నాను. ఎందుకంటే అంతకంటే ముందు పుట్టివుంటే నేను ఏం పీల్చుకునేవాణ్ణి టీచర్!?

అమ్మో!
తలచుకుంటేనే నాకు
ఊపిరి ఆడటం లేదు!




# అందరికోసం

*రచన: కె.ఎస్.వి.అనన్య, 6 వతరగతి, రాధాస్కూల్ ఆఫ్ లెర్నింగ్, అనంతపురం*

ఒక పల్లె పేరు రామాపురం. ఆ పల్లెలో రామయ్య, అతని భార్య సాలమ్మక్క ఉండేవాళ్ళు. ఆ వూళ్ళో నీళ్ళకు చాలా కరువుగా ఉండేది. కారణం, అక్కడ వర్షం చాలా తక్కువ పడేది. అంతే కాక వర్షం నీళ్ళు నిలవకుండా కొట్టుకు పోయేవి. ఒక ఏడాది ఆ పల్లెప్రజలు నీళ్ళ కోసం చాలా చాలా కష్టపడ్డారు. ఏమంటే అప్పటి వరకూ నీళ్ళు నిలువచేయడం కోసం వాళ్ళు ఏమీ ప్రయత్నించలేదు మరి.

ఆ సమయంలో రామయ్యకు, సాలమ్మక్కకు ఒక ఆలోచన వచ్చింది: "మన ఊరికి ఎప్పుడూ నీళ్ళ కరువు ఎందుకు, ఉంటుంది? ఊళ్ళో అందరూ ఉపయోగించుకోవటం కోసం ఒక కుంట త్రవ్వితే బాగుంటుంది కదా! వర్షం నీళ్లను ఇంకొన్ని రోజులు నిలువ ఉంచచ్చు కదా!"అని. దీని కోసం రాజుగారిని కలవాలని అనుకున్నారు వాళ్ళు. అయితే వాళ్ళ రాజుగారికి కోపం చాలా ఎక్కువ. అయినా గానీ

ఆ రాజుగారిని కలవాలని, ఇద్దరూ ధైర్యం చేసుకొని రాజధానికి వెళ్ళారు. కానీ వీళ్ళ వేషాలను చూసి వేళాకోళం చేశారు సైనికులు. ఎంత బతిమాలుకున్నా వాళ్ళని లోపలికి అనుమతించలేదు. ఇక చేసేది ఏమున్నది? ఇద్దరూ ఖాళీచేతులతో ఇంటికి తిరిగి వచ్చారు.



ఊళ్లోకి రాగానే రామయ్య, సాలమ్మక్క ఒకొక్క ఇంటికీ వెళ్ళి తమ ఆలోచనను తెలియజేసారు. "వాతావరణం ఇలాగే ఉంటే కొద్దిరోజులకు పూర్తిగా కరువు ఏర్పడుతుంది. అప్పుడు ఇక వ్యవసాయానికి, త్రాగటానికీ రెండింటికీ నీళ్ళు ఉండవు. వర్షపు నీటిని నిల్వ చేయకపోతే లాభం లేదు- మనకు ప్రతి యేడూ నీటి కరువు ఉంటుంది, తప్పదు. అందుకని మనం మన ఊళ్ళోఒక బావినో, చెరువునో తవ్వుకుందాం" అని చెప్పుకుంటూ పోయారు. ప్రజలందరికీ "ఔను! మనం ఇలాగే ఉంటే మనకే నష్టం" అనిపించింది. అందరూ కలిసి కట్టకట్టుకొని అనువైన స్థలంలో ఒక కుంటను తవ్వడం మొదలు పెట్టారు. కుంట పని పూర్తయ్యేసరికి వర్షం వచ్చింది. కుంటలో నీళ్ళు నిల్వ ఉండేసరికి ప్రజలందరికీ పట్టరాని సంతోషమైంది.

ఈ విషయం తెలుసుకొని పక్క ఊరి ప్రజలు వచ్చి రామయ్యను సంప్రదించారు. ఆయన చెప్పినట్లు వాళ్ళూ ఒక చెరువును తవ్వుకున్నారు. ఇంకొక ఊరి వాళ్ళూ అలాగే చేసారు.

క్రమంగా రామయ్య, సాలమ్మక్కల ఆలోచన రాజ్యమంతా విస్తరించింది. బావులు, కుంటలు, చెరువులు- ఇలా చాలా రకాల నీటి వనరులను ప్రజలు వాళ్ళంతట వాళ్ళే నిర్మించుకున్నారు. దాంతో కరువు రాజ్యాన్ని వదిలి వెళ్ళిపోయింది.

ఎప్పుడూ కోపంలో ఉండే రాజుకి రాజ్యంలో

జరుగుతున్న మార్పులు గమనించడానికి చాలా సమయం పట్టింది.




ఏం జరిగిందో తెలుసుకున్నాక ఆయన విపరీతంగా సిగ్గుపడ్డాడు- "ఇంత పెద్ద రాజును, నేను ప్రజలకి అంత మాత్రం సహాయం చేయలేక పోయానేమి?" అని.

"ప్రజల్లారా! ఈ రోజు నుండీ రాజ్యం అంతటా చెరువులు, ఆనకట్టలు కట్టిస్తాం" అని వాగ్దానం చేసాడు. పని వాళ్ళను పిలిపించి ఊరూరా, అక్కడి అవకాశాలను బట్టి- చెరువులు, కుంటలు కట్టించాడు; ఊట బావులు త్రవ్వించాడు.


అటుపైన రాజ్యంలో ఎన్నడూ కరువన్నదే రాలేదు.




చంద్రుడి మీద అయితే పర్వాలేదు!
మరేమంటారు?!




# కున్ని ముత్తు



రచన: ఏ. స్టీఫెన్, 8 వ తరగతి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా

కేరళలో కరిమన్నూరు అని ఒక ఊరు ఉంది. ఆ ఊళ్ళో కున్నిముత్తు అనే పిల్లవాడు ఉండేవాడు. వాడు ఒట్టి అల్లరి. వాడు చాలా చిన్నగా ఉన్నప్పుడే అమ్మ చనిపోయింది. నాన్న ఒక్కడే ఇక ఉన్నది. అయితే కున్నిముత్తు వాళ్ల నాన్న ఒక దొంగ! అక్కడా ఇక్కడా చిల్లర దొంగతనాలు చేస్తూ, చెడు సావాసాలు చేస్తూ జీవితం గడిపేవాడు. అయినా కొడుకంటే మటుకు చాలా ముద్దు. భార్య చనిపోయినప్పటి నుండీ కొడుకుకోసం అంగట్లో అవీ ఇవీ కొనుక్కొచ్చి పెట్టేవాడు. నిదానంగా కున్నిముత్తు చిరుతిండ్లకు బాగా అలవాటయ్యాడు. వాళ్ళ నాన్న అతనికి రోజూ చాలా చిల్లర డబ్బులు కూడా ఇచ్చేవాడు మరి! స్కూల్లో చేరిన తరవాత కూడా కున్నిముత్తులో ఏ మార్పూ రాలేదు. స్కూలు ముందర ఉండే

ఒక అంగట్లో పనికిరాని పదార్థాలన్నీ తినేవాడు. వీడి జేబులో ఎప్పుడూ గలగలలాడే చిల్లర డబ్బుల్ని చూసి నలుగురైదుగురు పిల్లలు ఎప్పుడూ వీడి వెంటనే ఉండటం మొదలు పెట్టారు. వీళ్లంతా క్లాసుల్లో సరిగా కూర్చోరు. బడికి శుభ్రంగా రారు. మాసిన బట్టలు, చింపిరి జుట్టు, జేబుల్లో ఎప్పుడూ ఏవో చిరుతిండ్లు - ఉపాధ్యాయులు ఎన్ని సార్లు చెప్పినా వీళ్ళు మాత్రం మారలేదు. కున్నిముత్తు వాళ్ళ నాన్నకు కూడా చాలా సార్లు చెప్పారు. ఏమీ ఫలితం లేక పోయింది. చివరికి ఊళ్ళో అందరూ వాడికి 'అల్లరి పిల్లవాడు' అని ఓ ముద్రవేసి ఊరుకున్నారు.




కున్నిముత్తు ఆరో క్లాసుకు వచ్చాడు ఇప్పుడు. ఆ సమయంలో వాళ్ల స్కూల్లో వచ్చి చేరారు ఒక కొత్త టీచరు గారు. చేరిన మొదటి రోజే కున్నిముత్తు అల్లరిని గమనించారు ఆవిడ. వీడి కారణంగా ఇతరుల క్లాసులుకూడా ఎంత చెడుతున్నాయో అర్థమైంది ఆవిడకు. రెండ్రోజుల్లో వాడి కుటుంబం గురించి, వాడి చిల్లర డబ్బుల గురించి తెలుసుకున్నారావిడ. ఎలాగైనా అతన్ని బాగు చేయాలని నిర్ణయించుకున్నారు.

సుజాత మేడం చాలా ఆలోచించారు. 'కున్నిముత్తుకు క్లాసులు ఆసక్తిగా ఉండేది ఎలాగ' అని ఆలోచించారు. పిల్లలకు ఇష్టమైన పాటలు, కథలు, ఆటల్ని పాఠాల్లో భాగంగా చేసారు. వాటి ద్వారా పిల్లలకు చదువులతోబాటు , మంచి ఆహార అలవాట్లు నేర్పారు. పరి శుభ్రత గురించిన పాటల ద్వారా వాళ్ళకు మంచి అలవాట్లు నేర్పారు. చూస్తూండగానే పిల్లలందరికీ చదువులపట్ల ఆసక్తి పెరిగింది- కున్నిముత్తుకు కూడా! చదువులు రాగానే మిగిలిన అలవాట్లలోకూడా మార్పులు వచ్చాయి. అతని స్నేహితులు అందరూ కూడా బాగా చదువుకోవడం మొదలెట్టారు.

అయితే కున్నిముత్తు వాళ్ళ నాన్నకు తన కొడుకు చదువుకోవడం ఇష్టం లేదు. హైస్కూలుకు వస్తూనే కొడుకు తన పనుల్లో తోడుగా ఉంటాడని, తన శ్రమ తగ్గుతుందని, కొడుకుకు దొంగతనాలు మప్పవచ్చనీ ఇన్నాళ్ళూ ఆశించాడు. కానీ వీడు ఇప్పుడు చదువుల మీద ఇష్టం పెట్టుకున్నాడు!



అందుకని చాలా సార్లు స్కూలుకెళ్ళి టీచర్లతో గొడవ పడ్డాడు అతను. 'నా కొడుకు, నా ఇష్టం' అని అరిచాడు. అయితే బడిలో టీచర్లు ప్రతిసారీ అతన్ని తిట్టి, బెదిరించి, కున్నిముత్తును బాగా చదువుకొనేలా చేసారు.

పదో తరగతి పరీక్షల్లో కున్నిముత్తుకు రాష్ట్ర స్థాయిలోనే గొప్ప మార్కులొచ్చాయి. అతన్ని సన్మానించడానికి జిల్లా కలెక్టరుగారు స్వయంగా స్కూలుకు వచ్చారు. హెడ్మాస్టరుగారు అప్పుడు ఆ సభకు కున్నిముత్తుతోబాటు వాళ్ళ నాన్నని కూడా పిలిపించారు.

సభలో ఆయన కున్నిముత్తు వాళ్ళ నాన్న గురించి చాలా గొప్పగా మాట్లాడాడు. "పాపం, బాబు చాలా చిన్నగా ఉన్నప్పుడు వాళ్ళ అమ్మ పోయింది. అప్పటి నుండి అన్నీ తనే అయి బాబును చాలా బాగా పెంచాడు. దాని కోసం చాలా కష్టపడ్డాడు. ఆయన చాలా గొప్ప మనిషి. కున్నిముత్తును టీచర్ల కంటే అతనే ఎక్కువ చదివించాడు..." ఇలా చెప్పేసరికి అందరికీ ఆశ్చర్యమయింది. అతనికీ నోట మాట రాలేదు. కలెక్టరుగారు అతన్ని పూల మాల వేసి అభినందించారు. దీంతో కున్నిముత్తు వాళ్ల నాన్న సిగ్గుతో కుంచించుకుపోయాడు. పూర్తిగా మారి-పోయాడు.

అటుపైన బాగా చదువుకున్న కున్నిముత్తు, పెద్దయ్యాక ఒక మంచి కలెక్టరయ్యాడు! 🙂





# నా కథ

*హర్షవర్ధన రాసిన ఈ కథ హిమాలయాలంత పాతది. దానికే కొంచెం మసిపూసి ఇట్లా మారేడు కాయ చేశాడు..*
*'రచన': పి. హర్షవర్ధన రెడ్డి, 2 వ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.*

మా బడిలో పిల్లలకు తెలుగు అంటే చాలా ఇష్టం. రకరకాల పిట్టకథలు, పొడుపు కథలు, సామెతలు చెబుతూ, రాస్తూ ఉంటారు.

ఒక రోజు మా బడిలో సునీల్ ఒక వాక్యం చెప్పి, దానిమీద ఒక కథ అల్లమన్నాడు. ఆ వాక్యం - “పుటుక్కు జరజర డుబుక్కు మేమే". మేమంతా చాలా ఆలోచించాం; కానీ కథ కుదరడం లేదు. అందరమూ ఆలోచిస్తూనే ఉన్నాము. ఇలా మూడు రోజులు గడిచింది. చివరికి మా అమ్మను అడిగితే, చిన్న లంకె అందించింది. దానితో నేను కథను ఇలా అల్లాను:

మా ఇల్లు బోదగడ్డి కొట్టం. కొట్టం మీద నిండుగా గుమ్మడి తీగ అల్లుకుంది. దానికి ఒక లావుపాటి గుమ్మడికాయ కాసింది.

కొట్టం చూరు కిందేమో, ఒక మేక కట్టేసి ఉంది.

అంతలో మా పిల్లి కొట్టంమీదికి ఎక్కి, పైనున్న గుమ్మడి తీగను **పుటుక్కున** కొరికేసింది. అది కొట్టం మీద నుండి **జర జరా** జారి, కింద ఉన్న మేక మీద **డుబుక్కున** పడింది. అప్పుడు మేక **మేమే** అని అరిచింది.

ఇలా కథను అల్లి సునీల్ కి చెప్పాను. సునీల్ కి తెలిసిందీ ఈ కథేనట! మా అమ్మ ఎంత తెలివైనదో చూడండి!!

తెలివి బాగా ఎక్కువైందండి!




కమల : హలో! సినిమా టికెట్ ఎంతండి?

క్లర్క్ : 40 రూపాయలు.

కమల : పిల్లలకెంత?

క్లర్క్ : పిల్లలక్కూడా 40 రూపాయలే

కమల : అదేంటి! బస్ లో పిల్లలకు సగం చార్జే తీసుకుంటారు కదా!

క్లర్క్ : అయితే పిల్లలను బస్ లో కూర్చోపెట్టి మీరు సినిమాకి రండి.



# ఎవరికీ చెప్పద్దు

*ఆంగ్లరచన: జి. వినయ్, వి.వి.విద్యాలయం, సత్తుపల్లి,ఖమ్మం.*
*సౌజన్యం: బాలోత్సవం, కొత్తగూడెం, నవంబరు* 2010

మూడేళ్ళ క్రితం నేను చాలా అల్లరి పిల్లవాడిని. అప్పుడోసారి మా ఇంట్లోవాళ్లందరం తిరుపతి వెళ్ళాం, వెంకటేశ్వర స్వామి గుడికి. నడిచి కొండ ఎక్కాలని మొక్కుకున్నది మా అవ్వ. అందుకని అందరం మెట్లు ఎక్కటం మొదలు పెట్టాం.

నాకు ప్రకృతి అంటే చాలా ఇష్టం కదా, అక్కడినుండి కనబడే కొండలు, లోయలు అన్నీ నాకు చాలా నచ్చాయి. సగం మెట్లు ఎక్కే సరికి ఆ ప్రకృతిని ఇంకా దగ్గరగా ఆస్వాదించాలని కోరిక పుట్టింది నాకు. ఎవ్వరికీ చెప్పకుండా మెట్లు దాటుకొని అడవిలోకి వెళ్లిపోయాను.

కొంత దూరం నడిచాక నా వెనక ఏదో అలికిడి అయ్యింది. వెనక్కి తిరిగి చూస్తే, అది ఒక ఎలుగుబంటి! భయంతో నా నోట్లోంచి అరుపు

కూడా బయటికి రాలేదు. ఎట్లా పరుగెత్తానో నాకే తెలీదు. ఆయాసం వచ్చి ఆగి చూసుకునేసరికి నేను దారి తప్పి ఉన్నాను! ఎటు వెళ్తే ఏమి వస్తుందో తెలీదు. నేను వచ్చిన దారిని గుర్తుపట్టే వీలే లేదు!



అప్పుడు సమయం మధ్యాహ్నం రెండు గంటలైంది. దట్టమైన ఆ అడవిలో మధ్యాహ్నం కూడా రాత్రి పూటలాగా అనిపిస్తోంది. అంత పెద్ద అడవిలో ఉన్నది నేను ఒక్కడినే.. భయంతో నాకు వణుకు పుట్టింది. అదృష్టవశాత్తు నా జేబులో ఒక చిన్న టార్చిలైటు ఉన్నది. దాన్ని వేసి అటూ ఇటూ చూశాను. దగ్గరలోనే నేలమీద ఒక అగ్గిపెట్టె పడేసి ఉన్నది. ఎవరో యాత్రీకులు ఇటువైపు వచ్చి, ఇక్కడ పడేసుకొని ఉండాలి..ఎందుకైనా మంచిదని నేను దాన్ని తీసి జేబులో వేసుకున్నాను. దూరంగా ఎక్కడో ఒక రోడ్డులాంటిది ఉన్నట్లు అనిపించింది. ఇక్కడ చీకట్లో నిలబడి ఉండేకంటే అక్కడికి వెళ్తే ఎవరో ఒకరిని సాయం అడగచ్చు అనిపించింది. అటు వైపుకు నడవటం మొదలుపెట్టాను.

అకస్మాత్తుగా కనిపించింది నాకు- నన్ను తరుముకుంటూ వచ్చిన ఎలుగుబంటి- నాకు కొంచెం ముందుగా కూర్చొని ఉన్నది! నేను వెంటనే వెనక్కి తగ్గి, ఒక పొదలో దాక్కున్నాను. 'ఎప్పుడు ఆ ఎలుగుబంటి వచ్చి మీద పడుతుందా' అని నా గుండెలు పీచుమంటున్నాయి. అంతలో నాకొక ఉపాయం తట్టింది. కొద్దిరోజుల క్రితమే టివిలో చూశాను- ఎలుగు బంటిని భయపెట్టేందుకని హీరో మంట వెలిగిస్తాడు- అగ్గిపెట్టె నా జేబులోనే ఉన్నది గద, ఇంక నాకేమి భయం?!

శబ్దం కాకుండా అక్కడి చితుకులన్నిటినీ ఒక దగ్గర పేర్చి అంటించాను. మెల్లగా మంట

రాజుకున్నది. అయినా ఎలుగుబంటి అటువైపు చూడలేదు. నేను పులిలాగా అరుస్తూ మండుతున్న కట్టెనొకదాన్ని ఎలుగుబంటి మీదికి విసిరాను. దాంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిందది- మరుక్షణం ఎటో పరుగెత్తింది; ఇంక కనిపించకుండా.

ఆ సరికి సాయంత్రం కావస్తున్నది. దగ్గరలోనే ఎత్తుగా కనిపిస్తున్నది రోడ్డు- నేను ఆ రోడ్డుకంటే కనీసం 200 మీటర్ల లోతులో ఉండి ఉంటాను. క్రిందినుండి ఎంత అరిచినా రోడ్డు మీద పోయే వాహనాలకు నేను కనిపించే అవకాశం లేదు. మా ఇంటివాళ్ళు నాకోసం వెతుక్కుంటున్నారేమో..ఈపాటికి వాళ్ళు పోలీసులకు చెప్పిఉంటారు.. ఎలాగో ఒకలాగా పోలీసులను చేరితే బాగుండు.. ఇలా సాగుతున్నాయి నా ఆలోచనలు.


అంతలో గుర్తుకొచ్చింది నా టార్చిలైటు. సాయంత్రపు మసక చీకటిలో దాని వెలుగు దారినపోయేవాళ్లను ఎవరినైనా ఆకర్షించకపోదు! నేను దాన్ని వెలిగించి అటూ ఇటూ ఊపాను..అరుస్తూ. లాభం లేదు..ఇంకేదైనా ఉపాయం ఆలోచించాలి..

చీకట్లు కమ్ముకుంటున్నాయి. అడవిలో చలి మొదలైంది. నాకు ఏడుపొస్తోంది..ఈ చలిలో ఏ పులో వచ్చి మీదికి దూకితే ఎలాగ?




అంతలో నాకు ఒక ఐడియా వచ్చింది. శబ్ద తరంగాలను ఎక్కువ దూరం పంపించాలంటే వాటి దిశను మనం నిర్దేశించాలి. కొమ్ము బూరలో జరిగేది అదేగద! నేను వెంటనే టేకు చెట్టు ఆకునొకదాన్ని తీసుకున్నాను. దాన్ని పొట్లంలాగా చుట్టి, దానిలోనుండి అరుస్తూ టార్చిలైటును అటూ ఇటూ ఊపటం మొదలుపెట్టాను. చివరికి నా శ్రమ ఫలించింది! అటుగా వచ్చిన పోలీసులు నన్ను గుర్తించారు!!

కొందరు పోలీసులు లోయలోకి దిగి, నన్ను మా అమ్మానాన్నల దగ్గరికి చేర్చారు. మా ఇంట్లోవాళ్ళంతా పోలీసుల్ని అభినందించారు- అందరూ తిడతారనుకున్నానుగానీ, ఎవ్వరూ ఏమీ అనలేదు నన్ను. అయితే ఆ రోజునే నేను నిశ్చయించుకున్నాను- 'పెద్దవాళ్లెవ్వరికీ చెప్పకుండా, వాళ్ళ అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్ళను' అని! మీరూ వెళ్ళకండేం, మరి!




సంగీతానికి సులభ మార్గం!

ఇది జోకు కాదు!
'చదువుకోకుండా టివి చూస్తుంటే ఇలా అయిపోతారు' అని నాలుగో తరగతి శృతి వేసిన బొమ్మ ఇది!





# బొజ్జదేవుడు



*సేకరణ: ఆర్.ప్రగతి, 9 వతరగతి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, వెంకటంపల్లి, అనంతపురం జిల్లా.*

అనగనగా వెంకటంపల్లిలో ఒక సాధువు నివసించేవాడు. ఒకసారి రామయ్య అనే రైతు ఒకడు సాధువు దర్శనం చేసుకొని, "అయ్యా! ఈ భూమి మీద అన్నింటికన్నా గొప్పది ఏది?" అని అడిగాడు. "భూమి మీద ఉన్నవన్నీ గొప్పవే నాయనా! వాటిలో హెచ్చు తగ్గులు మనం కల్పించుకున్నాం, అంతే. అయినా నీకు ఆ అనుమానం ఎందుకు వచ్చింది?" అడిగాడు సాధువు.

"అయ్యా! మామూలు ప్రజలు రకరకాల దేవుళ్ళను పూజిస్తారు. నేను మాత్రం ఈ భూమిమీద అన్నింటి కంటే గొప్ప దానిని మాత్రమే పూజించాలనుకుంటున్నాను" చెప్పాడు రామయ్య.

సాధువు చిరునవ్వు నవ్వాడు. "నీ ఇష్టం ఎలా ఉంటే అలా కానివ్వు నాయనా! ఎటొచ్చీ దేన్నీ అతిగా మాత్రం చెయ్యకు" అని సాధువు తన దగ్గర ఉన్న ఒక విగ్రహాన్ని రామయ్య చేతికి

ఇచ్చాడు. "నాకు తెలిసినంతవరకూ ఇది గొప్పదే నాయనా! దీన్ని పూజించు" అన్నాడు.

"ఇది భూమి మీద అన్నింటి కన్నా గొప్పదే కద, స్వామీ!" అడిగాడు రామయ్య, దాన్ని కళ్ళకద్దుకుంటూ.

"కావచ్చు, కాకపోవచ్చు కూడాను.. దీన్ని పూజిస్తూ ఉండు; ఒక వేళ నీకు దీనికన్నా గొప్పది వేరే ఏదన్నా కనిపిస్తే, అప్పుడు దీని బదులు దాన్ని పూజించు!" అని చెప్పాడు సాధువు, నవ్వుతూ.

రామయ్య ఆ విగ్రహాన్ని సంతోషంగా ఇంటికి తీసుకెళ్ళాడు. పూజా మందిరంలో దాన్ని ప్రతిష్ఠించి, రోజూ పూజించడం మొదలు పెట్టాడు. ప్రతిరోజూ ఆ విగ్రహానికి ఏదో ఒక పండుని నైవేద్యంగా అర్పించేవాడు; పూజలు చేసి, దీపం వెలిగించి పాటలు పాడేవాడు.

ఇలా కొన్నాళ్ళు గడిచాయి. ఒకరోజున రామయ్య విగ్రహం ముందు ఉంచిన పండు ఎలా మాయమైందో, మాయమైంది! ఆశ్చర్యపడ్డ రామయ్య మరునాడంతా మాటిమాటికీ దేవుడి గదినీ, విగ్రహాన్నీ, నైవేద్యాన్నీ చూస్తూ గడిపాడు. చూడగా అది ఒక ఎలుక! ఎలుక వచ్చి విగ్రహం ముందు ఉంచిన పండును తీసుకొని తింటున్నది!

దాన్ని చూసిన రామయ్యకు అనిపించింది: "ఆహా! ప్రాణం లేని ఈ విగ్రహం దానికి అర్పించిన పండుని కూడా కాపాడుకో-లేకపోతున్నది కదా! ఈ ఎలుకే గొప్పది, దానికంటే!" అని. "స్వామి వారు చెప్పారు కదా, 'దీనికంటే గొప్పది ఏదైనా కనబడితే దాన్ని పూజించు' అని?" అందుకని రామయ్య ఆ రోజు నుంచి విగ్రహానికి బదులు ఎలుకను పూజించటం మొదలుపెట్టాడు.

ఇప్పుడు రోజూ ఆ ఎలుక వుండే కన్నం ముందు రకరకాల ఆహార పదార్థాలు ఉంచుతున్నాడు రామయ్య. ఆ ఎలుక వాటిని తినటానికి బయటికి వచ్చినప్పుడల్లా దానికి సాగిలపడి మొక్కుతున్నాడు. ఎలుక కూడా భయంలేకుండా అతను పెట్టిన పదార్థాలనన్నిటినీ తన కలుగులోకి చేర్చుకుంటూ పోతున్నది.

అంతా బాగా నడుస్తోంది అనగా, ఒక రోజున రామయ్య చూస్తూండగానే ఒక పిల్లి ఆ ఎలుక మీదికి దూకింది. చటుక్కున దాన్ని నోట కరచుకొని పారి పోయింది!

మరుక్షణం రామయ్యలో పిల్లి పట్ల భక్తి ఉదయించింది. ఎలుక భక్తుడు రామయ్య, ఇప్పుడు పిల్లి భక్తుడుగా మారిపోయాడు.

ఎలుకకన్నా పిల్లిని పూజించటం సులభంగా ఉంది. పిల్లికి నైవేద్యం పెట్టటం సులభం. కొన్నాళ్ళు ఇది బాగానే నడిచిందిగానీ, ఒక రోజున పిల్లికి గిన్నెలో పాలు పోసి పెట్టేసరికి, దగ్గర్లోనే ఉన్న కుక్క ఒకటి పరుగెత్తుకొచ్చింది. పిల్లి మీదికి దూకి పాలు కాస్తా తాగేసింది. బ్రతుకుజీవుడా అని పిల్లి కాస్తా పారిపోయింది.

వెంటనే ఆ కుక్కలో దైవత్వం కనిపించింది, రామయ్యకు. "గొప్ప దేవుడు, ఇన్నాళ్లకు దొరికాడు" అని ఇప్పుడు అతను కుక్కను పూజించటం మొదలుపెట్టాడు. కుక్క దేవుడికి కూడా చాలా సంతోషం కలిగింది. ఇప్పుడు దానికడుపు నిండుతున్నదిగద, బాగా!

ఒక రోజున ఆ కుక్క వాళ్ల వంటింట్లోకి దూరింది. ఒక పాత్ర దగ్గర మూతిపెట్టి వాసన చూడటం మొదలు పెట్టింది. గబుక్కున లోపలికి వచ్చిన రామయ్య భార్య కోపం పట్టలేకపోయింది. "ఓ రామయ్యా! ఇటురా! నీ దేవుడు ఏం చేస్తున్నదో చూడు!" అని ఒక్కపెట్టున అరిచి, ఆమె చేతికందిన కర్రనొకదాన్ని కుక్కమీదికి విసిరేసింది. కుయ్యో కుయ్యోమని కుక్క దేవుడు పారిపోతుంటే చూసిన రామయ్యకు తన భార్యలో ఆ కుక్క కంటే గొప్పదేవుడు కనబడటం మొదలు పెట్టాడు.

ఆనాటి నుండి తన భార్యను పూజించటం మొదలు పెట్టాడు రామయ్య. ఆమెకు అది చాలా సంతోషాన్నిచ్చింది. కానీ ఆమె సంతోషం ఎంతోకాలం నిలవలేదు. రెండో రోజునే ఆమె సాంబారులో ఉప్పు వెయ్యడం మరచిపోయింది. భార్యలోని దేవుడిని తాత్కాలికంగా మర్చిపోయిన రామయ్య, భార్యమీదికి అంతెత్తున ఎగిరాడు. అతని అరుపులకు ఆమె గజగజా వణికిపోయింది.

మూలన కూర్చొని ఏడవటం మొదలు పెట్టింది. ఆ క్షణంలో రామయ్య కళ్ళు మళ్ళీ తెరుచుకున్నాయి. "ఈమె ఎవరు? నా దేవత! అంతటి దేవతే నన్ను చూసి ఇంత భయపడిందంటే, ఇక నేనే గొప్పవాడిని గదా, ఆమెకన్నా?" అనుకున్నాడతను.



"ఓహో! అందరిలోకీ గొప్పవాడిని నేనే" అని, ఇక తనను తానే పూజించుకోవడం మొదలు పెట్టాడు రామయ్య. రోజూ అగరు బత్తులు వెలిగించి, తనను తానే పొగుడుకుంటూ పూజ చేసుకోవటం మొదలుపెట్టాడు.

ఒక రోజున రామయ్యకు కడుపులో బాగా ఆకలైంది. తనకు తను గంధం పూసుకున్నా, అగరు వత్తులు వెలిగించుకున్నా, హారతులు ఇచ్చుకున్నా, అతని ఆకలి మాత్రం ఆగేటట్లు లేదు. చివరికి అతను తన పూజను మధ్యలోనే ఆపివేయాల్సి వచ్చింది. ఆదరాబాదరా తింటూండగా అతనికి అర్థం అయ్యింది- తనకంటే గొప్ప దేవుడు, తన కడుపు!

ఒకసారి ఈ ఆలోచన వచ్చాక రామయ్య ఇక ఆగలేకపోయాడు. తన కడుపునే తన దేవునిగా మార్చుకున్నాడు. ఈ బొజ్జదేవుడు చాలా ప్రమాదకరమైన దేవుడు- ఎందుకంటే ఎన్నెన్ని పెట్టినా ఆ దేవుడు మాత్రం ఎంతకీ ప్రసన్నం కాడు!

"ఎప్పుడూ తింటూనే ఉండాలి! నా దేవుడికి ఎప్పుడూ నైవేద్యం పెడుతూనే ఉండాలి " అనుకున్నాడు రామయ్య. తినీ తినీ అతని కడుపు పెద్ద బానలా తయారయ్యింది. దాన్ని చూసిన కొద్దీ రామయ్యకు భక్తి భావం ఇంకా ఇంకా ఎక్కువౌతూనే పోయింది. దాన్ని ఇంకా ఇంకా నింపటం మొదలు పెట్టాడు.

చివరికి ఒకనాడు ఆ వెర్రి భక్తుడు అలాగే ముందుకు ఒరిగి కన్ను మూశాడు!



# పెద్దచింతచెట్టు - చిన్న చింతచెట్టు

*రచన: పి.సతీష్, 5 వతరగతి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గడ్డంనాగేపల్లి, నార్పల (మండలం), అనంతపురం జిల్లా*

ఒక అడవిలో రెండు చింత చెట్లు ఉండేవి. ఒకటేమో పెద్దది. ఇంకొకటేమో చిన్నది. ఒకరోజు ఆ అడవికి ఒక కాకి వచ్చింది, తన పిల్లలతో బాటు. అవి గూడు కట్టుకొనడానికి ఒక చెట్టు కావాలి. పెద్ద చింత చెట్టును చూసి 'ఇదైతే మనకు బాగుంటుంద'ని అనుకున్నాయవి. అప్పుడు అమ్మ కాకి దాని దగ్గరకు వెళ్ళి, "బావా! బావా! నీకొమ్మల మీద మేము ఇల్లు కట్టుకుందుమా?" అని అడిగింది. దానికి ఆ చింతచెట్టు, "ఏయ్! ఏమనుకున్నారు నేనంటే! నీలాంటోళ్ళు నా మీద ఇల్లు కట్టుకునేది! పోతారా, లేదా!?" అని గట్టిగా కసురుకుంది. ఆ అరుపుకి భయపడి అక్కడ్నించి వెళ్ళిపోయాయి అవి.

తరువాత అవి చిన్న చింతచెట్టు దగ్గరకు వెళ్ళి, "బావా! బావా! నీ చిన్ని చిన్ని కొమ్మల్లో మేము

ఇల్లుకట్టుకుందుమా?" అని అడిగాయి. చిన్న చింతచెట్టు సంతోషంగా, "దానిదేముంది, వచ్చి నా కొమ్మల్లో మీకు ఇష్టమొచ్చినట్లు ఇల్లు కట్టుకోండి. నాకూ మీ తోడు బాగుంటుంది" అనింది.



కాకులు భలే సంతోషపడ్డాయి. అక్కడక్కడా ఉన్న ఎండు పుల్లల్ని ఏరి తెచ్చి కాకులు చిన్న చింత చెట్టులో ఒక చక్కని ఇల్లు కట్టుకున్నాయి. నిదానంగా కాకులు చాలా అయినాయి. అన్నీ సంతోషంగా బతుకుతున్నాయి. ఇప్పుడు చెట్టు నిండా చాలా కాపురాలయినాయి. కాకుల సందడితో చిన్న చింతచెట్టూ సంతోషంగా ఉంది.

ఒకరోజు చింతాకు కోసమని పక్కూరు నుండి చాలా మంది మనుషులు ఆ అడవికి వచ్చారు. వాళ్ళకి మొదట చిన్న చింతమాను కనబడింది. దాని మీది చింతాకు వాళ్ళకు బాగా నచ్చింది. కానీ దాని మీదున్న కాకుల్ని చూసి, "అయ్యో! దీని చింతాకు మనకొద్దు. దీని మీద ఎన్ని కాకులున్నాయో! అవి మనల్ని పొడుస్తాయి, ఇక్కడ వద్దు," అని ఆ మనుషులు అలా పోతూ ఉంటే వాళ్ళకు పెద్ద చింతచెట్టు కనబడింది. దానిలో కూడా చింతచిగురు చాలా బాగా కాసి ఉంది. కానీ చిన్నచెట్టు మీదలాగా దీని మీద కాకులు లేవు! అంతే! మనుషులంతా దానిమీద పడి, ఆ చెట్టు మీద ఉన్న చింతాకు మొత్తం పీక్కెళ్ళి పోయినారు. ఆకులన్నీ పోగొట్టుకొని, విరిగిపోయిన కొమ్మలు రెమ్మలతో బాగా ఏడ్చుకున్నాక, పెద్ద చింతచెట్టుకు బుద్ధి వచ్చింది. అప్పటినుండీ అది అందరినీ ఆహ్వానించటం, అందరినీ కలుపుకు పోవటం నేర్చుకున్నది.

# పొడుపు కథలు

*సేకరణ: సి.రామచంద్ర, నాలుగవ తరగతి, శ్రీమారుతి విద్యానికేతన, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.*
*ప్రగతి, తొమ్మిదవ తరగతి, వెంకటంపల్లి.*

1.రెక్కలుండు కాని పక్షికాదు.ఏమిటది?

2.తొండం ఉంటుంది కాని ఏనుగుకాదు.ఏమిటది?

3.కంఠము నందు నలుపు ఉండును కాని శివుడు కాదు.ఏమిటది?

4. కాళ్లు ఉండవు కాని నడుస్తుంది, కండ్లు ఉండవు కాని ఏడుస్తుంది-ఏమిటది?

5. తెల్ల మనిషికి నల్ల టోపీ-ఏమిటది?

6.ఒక కట్టెకు ఒక కొండ-ఏమిటది?

7.చాటనిండా బొరుగులు, ప్రొద్దున్నే చూస్తే లేవు- ఏమిటవి?

8. గుంపు చెట్లల్లో కారు పోయెను- ఏమిటది?

9. బయట వెండి; లోన బంగారం-ఏమిటది?

10.కాలులేని పిల్లవాడు కొండ ఎక్కెను- ఏమిటది?

సమాధానాలు:

1. ఈగ. 2. దోమ. 3. నెమలి 4. ఆకాశం 5. అగ్గిపుల్ల

6. పార 7. నక్షత్రాలు 8. పేను 9. కోడిగుడ్డు 10. పాము


దాహం తీరాక ఏం జరిగింది?
(గత మాసం తరువాయి..)
అనురాగ్ గోదావరి, ఐదవ తరగతి.
రాహుల్ త్రివేదీ
ఫోటోగ్రాఫరు
చందన్ కుమార్
వికీపీడియా
గుసగుసలు
ఈ మనిషి నా ప్రొఫెసర్!
సందర్శకులు :
1,000,000,000
ఈ ఫోటో ఈయనకు
పెద్ద పేరు తెచ్చి పెట్టింది.
(చాలా చిన్నబుచ్చింది!)

# బొమ్మకు కథ రాయండి!

*నిర్వహణ: శ్రీమతి జి.లలిత*, telugu4kids.com

క్రింది బొమ్మను చూడండి. మీకు ఏమనిపిస్తున్నది?



**సొరంగం...!**

సొరంగ మార్గం గుండా పోతే ఏమేం దొరుకుతాయో, తెలీదు! ఆ సొరంగం ఎక్కడికి తీసుకు పోతుందో కూడా తెలీదు..! అందులో ఏముంటాయో కూడా తెలీదు- కానీ ఏవో అద్భుతంగా ఉండి ఉంటాయిలే, అన్నీ! ఆ సొరంగం మనల్ని రాయలవారు దాచిపెట్టిన నిధుల దగ్గరికే తీసుకుపోవచ్చు; దొంగలు దాచుకున్న సొమ్ముల మూటల దగ్గరికే తీసుకు పోవచ్చు; లేకపోతే అందులో మనకు బుజ్జి బుజ్జి పులి పిల్లలో, పెద్ద పెద్ద ఎలుకలోదొరకచ్చు! మాకంటే ఆ కథలు ఏవో మీకే బాగా తెలిసిఉంటాయి. రాసి పంపించండి, మరి ఆలస్యం చేయకండి. మా కథ కంటే బాగుంటే మీకథనే ప్రచురిస్తాం!

మా చిరునామా: కొత్తపల్లి బృందం, యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515101
ఫోన్లు: 08559 240222, 7702877670



# కోతి

స్పందన

*రెండు నెలల క్రితం ఇచ్చిన 'బొమ్మకు కథ రాయండి' కి వచ్చిన స్పందన ఇది...*
*రచన: శ్రీమతి రాధ మండువ, ఉపాధ్యాయిని, ఋషి వ్యాలీ, మదనపల్లి, చిత్తూరు జిల్లా.*

రిషి వనం లో అంజనమ్మ, పవనయ్య అనే రెండు కోతులు ఉండేవి. వాళ్ళకి ముగ్గురు పిల్లలు.

"బిందూ! రేఖా! చక్రీ! ఎక్కడున్నారు? ఇటు రండి" పెద్దగా కేకలు వేసి వాళ్లని పిలిచింది అంజనమ్మ.

"ఏంటమ్మా!" అంటూ వచ్చారు బిందు, రేఖలు.

"చక్రి ఏడి? ఎక్కడకు వెళ్ళాడు? వీడి కాళ్ళు ఒక్కచోట కుదురుగా ఉండవు కదా!" అంది అంజనమ్మ, ప్రక్కనే నిలబడి ఉన్న తన భర్త పవనయ్యను చూస్తూ.



"వాడు పుల్లకు రంధ్రం చేసి, ఆ రంధ్రం గుండా పురుగులను పీల్చుకుని తింటున్నాడమ్మా! అన్నది బిందు.

"పిల్చుకురా, వాడిని ఇటు!" అని కోపంగా అరిచింది అంజనమ్మ.

అమ్మ అరవడం విన్న చక్రి తన చేతిలో ఉన్న పుల్లను చెట్టు వెనక దాచేసి, పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"నీకెన్ని సార్లు చెప్పాను, పురుగులను తినొద్దని?! నేను, నాన్న బయటకు వెళుతున్నాం. ఇంట్లోనే బుద్ధిగా ఆడుకోండి. మేం మంచి మంచి పళ్ళు, గ్రుడ్లు తెచ్చి పెడతాం, సరేనా!?" అంది అంజనమ్మ.

"సరేనమ్మా!" అంటూ ముగ్గురూ తలలు ఊపారు.

అంజనమ్మ, పవనయ్య బయటకు వెళ్ళారు. వాళ్ళు అటు వెళ్ళగానే చక్రి బయటికి పరిగెత్తాడు. అక్కలిద్దరికీ చెప్పకుండానే-

"ఒరే! తమ్ముడూ! వెళ్ళొద్దు. అమ్మ తిడుతుంది" అని బిందు అరుస్తున్నా వినిపించుకోలేదు చక్రిగాడు. వాడు చాలా అల్లరి కోతిగాడు కదా! అమ్మ మాటే వినడు. ఇక అక్క మాటేం వింటాడు?

చెట్టు చాటున దాచి పెట్టుకున్న పుల్లను తీసుకుని, పురుగుల కోసం రంధ్రం గుండా

చూస్తూ ఆడుతూ, పాడుతూ, గెంతుతూ అడవిలోకి పరుగెత్తాడు చక్రి.

దారిలో వాడికి ఒక చీమల బారు కనిపించింది. "భలే! భలే! చీమలు వరుసగా ఎక్కడికబ్బా, వెళుతున్నాయి?" అంటూ చీమల బారు వెంట నడుస్తూ నడుస్తూ పోయాడు వాడు. దారి తప్పి గుట్టల్లోకి వెళ్ళిపోయాడు గానీ, అలా దారి తప్పిన సంగతి కూడా తెలియలేదు వాడికి!

కొంతసేపటికి చీమల బారు కనపడకుండా పోవడంతో, మళ్ళీ పురుగుల వేట మొదలుపెట్టాడు. ఇంకొంచెం దూరం పోయేసరికి, అక్కడ పొలాల్లో క్యారెట్లు నాటుకుంటున్న కుందేళ్లు కనబడ్డాయి. దుముకుతూ వెళ్ళిన చక్రిని చూసిన కుందేళ్ళు "ఏయ్! అక్కడే ఆగు. పొలం తొక్కి పాడు చేస్తావా, ఏమిటి?!" అన్నాయి ఒక్కసారిగా.

"ఎందుకు పాడు చేస్తాను?" అన్నాడు చక్రి మూతి ముడుచుకుని.

అంతలో వాడికొక చెదలపుట్ట కనిపించింది. ఆ పుట్టలో వందల-వేల పురుగులు ఉన్నాయి! వెంటనే వాడు చేతిలో ఉన్న గొట్టాన్ని చకచకా నోట్లో పెట్టుకున్నాడు. పుట్టలో ఉన్న పురుగులను పీల్చుకొని నమలటం మొదలు పెట్టాడు. అయితే ఒక్కసారి గట్టిగా పీల్చేటప్పటికి, పురుగులన్నీ తకాలున వచ్చి, వాడి గొంతుకు అడ్డం పడ్డాయి! ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు చక్రి! ఊపిరి ఆడలేదు. ప్రాణం కొట్టుకున్నది నీళ్ళ కోసం. ఇక వాడు అడ్డదిడ్డంగా పరుగెత్తటం మొదలుపెట్టాడు. వాడి కష్టాన్ని చూసి ఒక చిలుక ఎగురుకుంటూ వచ్చింది వాడి దగ్గరికి.

అప్పటికే వాడికి ప్రాణం పోతున్నట్లు ఉంది. చిలుక "నాతో రా!" అని వాడిని చెరువు దగ్గరికి తీసుకెళ్ళింది. ఆత్రంగా నీళ్ళు తాగిన చక్రి, ఆ చెరువు గట్టునే ఓ చెట్టు కింద సోలిపోయాడు. గొంతు బాధ అయితే తగ్గింది కానీ ఇప్పుడు వాడికి విపరీతమైన కడుపు నొప్పి వచ్చింది. ఆ నొప్పిలో వాడికి అమ్మానాన్న గుర్తుకొచ్చారు. "మా అమ్మానాన్నల్ని పిలుచుకు రావా, ప్లీజ్" అని ప్రాధేయపడ్డాడు చిలుకను.

చిలుక ఎగురుకుంటూ వెళ్ళి పవనయ్యను

వెంట పెట్టుకు వచ్చింది. పవనయ్య చక్రిని వీపుమీద ఎక్కించుకుని ఇంటికి తీసుకు వచ్చాడు. అప్పటికే అంజనమ్మ కషాయాన్ని తయారు చేసి ఉంచింది. చక్రిగాడు రాగానే వాడి చేత వేప కషాయం తాగించింది. "వేపపుల్లను బాగా నమిలి, ఆ రసం మింగాలి. కడుపు నొప్పి తగ్గుతుంది" అని, వేపపుల్లనొకదాన్ని వాడి చేతిలో పెట్టి, వేపచెట్టు ఎక్కించింది అంజనమ్మ.

చెట్టు కింద కూర్చొని అన్న, అక్క, అమ్మ, నాన్నలు హాయిగా పండ్లు, గ్రుడ్లు తింటూ ఉంటే, చెట్టు మీద కూర్చొని చక్రిగాడు వేపపుల్లను నమలాల్సి వచ్చింది పాపం!

అయితే, బిందు అక్క చాలా మంచిది కదా, కొన్ని పండ్లను, గ్రుడ్లను చక్రిగాడి కోసం దాచి పెట్టింది. మర్నాడు వాటిని తమ్ముడికిస్తూ "తమ్ముడూ! బయటికి వెళ్ళి అన్నింటినీ పరిశీలించడం, క్రొత్త క్రొత్త విషయాలను తెలుసుకోవటం మంచిదే; కానీ పురుగులను తినడం చెడ్డ అలవాటు- అందుకే నీకు కడుపు నొప్పి వచ్చింది. చెడ్డ అలవాట్ల వల్ల కష్టాలు వస్తాయి!" అని చెప్పింది.

"ఇంకెప్పుడూ పురుగులను తిననక్కా!" అన్నాడు చక్రి, అప్పుడే బాగైన తన బొజ్జను నిమురుకుంటూ.

జోకులు

**త్రాగటం ఎందుకు?**

టీచర్: మనం నీళ్ళు ఎందుకు త్రాగాలో చెప్పగలవా?

రవి: నీళ్ళను 'తినలేం' కాబట్టి.

**మతిమరుపు!**

రామారావు: అందరి కన్నావేగంగా తొక్కానంటున్నావు. మరి సైకిల్ రేసులో బహుమతి ఎందుకు రాలేదు?

వెంగళప్ప: తొక్కింది నిజమే. కాని స్టాండ్ తీయడం మరిచిపోయా...

*సేకరణ: సామిరెడ్డి.*

# చిలిపిప్రశ్నలు

*నిర్వహణ: శ్రీ వి.వి.యస్.మూర్తి, చొదిమెళ్ళ, పశ్చిమగోదావరి జిల్లా.*

1."సన్న" గా వున్న మనవణ్ణి అమ్మమ్మ ప్రేమతో ఎలా పిలుస్తుంది?

పిచ్చి "సన్నా"సి!!

2.రాబోయే తరానికి మంచి వ్యాపార సూచన ఏమిటి!?

"ఆక్సిజన్" బార్!!

3.(చీకటి) 'DARK స్పెల్లింగు తప్పు రాశావేరా' అని అరిచిన మేస్టారు అదిరి పడేదెప్పుడు!?

'చీకట్లో మీకు కనపడదనుకున్నాను సార్ ' అని విద్యార్థి అన్నప్పుడు!!

4."అజ్ఞానం" అంటే....!?

'నాకు అన్నీ తెలుసు' అనుకోవటం!!

5.గాయకుడు వేలంపాటలో పాల్గొంటే....!?

పాట రక్తి కడుతుంది!!

6.తెలివైన వ్యాపారి స్లోగన్...!?

పువ్వులు కొంటే సువాసన ఉచితం!!

7.సాఫ్ట్ వేర్ ఇంజనీర్ డాక్టర్ దగ్గర కెళ్తే....!?

బి.పి చెక్ చేసి మీకు 'సైబర్ టెన్షన్' అంటాడు!!

**జోకు**

కస్టమర్: మీ హోటల్లో ఏం బాగుంటుంది?

వెంగళప్ప :మా యం.డి. గారి కుర్చీ!

*సేకరణ: సోమిరెడ్డి.*



# ఆకలి దప్పులు

*సేకరణ: శ్రీమతి సి.హెచ్.పార్వతి దేవి, హైదరాబాదు.*

అదొక కీకారణ్యం. దట్టంగా చెట్లు, చేమలు, పొదలు. తినేందుకు మాత్రం ఏమీ లేవు.

ఆ అడవిలో నడిచివెళ్తున్నారు గురువుగారు. ఆయన వెంట శిష్యులు మౌనంగా నడుస్తున్నారు.

కొంతసేపటికి వాళ్లంతా అడవిని దాటారు. అయితేనేమి, ఇసుక ఎడారిలో కాలుపెట్టారు! సూర్యుడు తీక్షణంగా ప్రకాశిస్తున్నాడు. భరించలేని వేడి. తల దాచుకోవడానికి ఎక్కడా చోటులేదు. కనుచూపు మేరలో చెట్టు అన్నది లేదు, ఆవగింజంత నీడకూడా లేదు.

'ఎక్కడైనా జనసంచారం కనిపిస్తుందేమో, కనీసం ఒక గుడిసె అయినా కనిపిస్తుందేమో'- అని శిష్యుల కళ్ళు ఆశగా వెతుకుతున్నాయి. గుక్కెడు మంచినీళ్ళు దొరికే మార్గం కూడా కనిపించడం లేదు.

ఎట్లాగో సూర్యాస్తమయందాకా నడిచారు అందరూ. సూర్యుడు అస్తమించాడు. చీకటి

అలుముకుంటోంది. అప్పుడు గానీ శిష్యుల నీరసం చూడలేదు గురువుగారు- "విశ్రాంతి తీసుకుందామా?" అన్నారు.

ఆ మాట విని వినటంతోనే శిష్యులు అందరూ ఆకలీ దప్పికా మరచిపోయారు. ఎక్కడివాళ్ళు అక్కడ ఆగిపోయారు; నడుంవాల్చారు; మైమరచి నిద్రపోయారు.

అయితే గురువు గారు మాత్రం ఎప్పటిలాగే పడుకునే ముందు ధ్యానం చేశారు: "దేవుడా! ఈ రోజు మీరు అనుగ్రహించిన దానికంతా కృతజ్ఞతలు!" అని చెప్పారు చాలాసార్లు.

కాస్త మేలుకొని ఉన్న శిష్యుడు ఒకడు గురువుగారి ప్రార్థన విన్నాడు. కోపం పొంగుకొచ్చింది అతనికి. చటుక్కున లేచాడు: "స్వామీ! దేవుడు ఇవాళ్ళ మనకు ఏమిచ్చాడు? ఏమీ ఇవ్వలేదు కదా! ఇక ఆయనకు కృతజ్ఞతలెందుకు చెప్పాలి, మనం?" అన్నాడు ఆవేశంగా.

గురువుగారు చిరునవ్వునవ్వారు. "ఏమీ ఇవ్వకపోవడమేమిటి? ఆకలంటే ఏమిటో అనుభవపూర్వకంగా చెప్పాడు కదా, ఆయన?! దాహమంటే ఏమిటో చెప్పాడు! అందుకే ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను!" అన్నాడు.

సుఖం, దు:ఖం నాణానికి రెండు పక్కలు. వీటిలో ఒక దాన్ని మాత్రమే స్వీకరించి రెండోదాన్ని తిరస్కరించటంలో నిజానికి అర్థం లేదు. రెండింటినీ సమానంగా స్వీకరించిన వాళ్ళే నిజమైన జ్ఞానులు.

**శ్రమ పెరిగింది!** జోకు

టీచర్: విద్యుత్ కనిపెట్టక పోతే ఏం జరిగేది?

చంటి: రాత్రి వేళ చదివే పని తప్పేది.

*సేకరణ: సోమిరెడ్డి.*




# కొత్తబడిలో మొదటి రోజు

*ఆంగ్లమూలం: సైరినా జాన్, ది హిందూ-జులై 19,2011, యంగ్ వరల్డ్*
*తెలుగుసేత: నారాయణ, కొత్తపల్లి బృందం.*

కొత్త బళ్లో నా మొదటిరోజు.. కొత్తబడి! అదే మా పాత బడిలో నైతే, సెలవుల తర్వాత మళ్లీ బడి తెరుస్తుంటే నేను ఎంత ఉత్సాహంగా ఉండేవాడినో! చుట్టూ మా ప్రాణస్నేహితులు నలుగుర్ని పెట్టుకొని, వాళ్లు సెలవల్లో ఏమేం సాహసాలు చేశారో వర్ణించి చెబుతుంటే.. అంతా భలే సరదాగా ఉండేది! కానీ ఇప్పుడు...? ఈ సంవత్సరం అట్లా కాదు. బడంటే మా పాత బడే.. ఎంత బాగుంటుందో మా బడి..!

నేను ఇంకా మా పాతబడి గురించిన ఊహల్లోనే ఉన్నాను, కానీ నిజానికి ఈ బడి కూడా బాగానే ఉన్నట్లుంది... నీడనిచ్చే చెట్లున్నై, చాలా. గాలి చల్లగా, బాగుంది. వాతావరణం హాయిగా ఉంది.

ఉదయం అసెంబ్లీలో అందరూ వరసలుగా నిలబడితే, నాలాగే 'ఎక్కడో తప్పిపోయిన

మొహాల్లాంటి' పిల్లలూ ఉన్నారు; పాత స్నేహితుల్ని కలుసుకున్న ఆనందంతో బిగ్గరగా, అలుపులేనట్లు మాట్లాడేస్తూ ఉన్న పిల్లలూ ఉన్నారు.

అసెంబ్లీ అయిపోగానే అందరం మా మా తరగతి గదుల్లోకి నడుస్తున్నాం. నాకేమో క్రొత్తగా, భయం భయంగాఉంది. గదిలోకి వెళ్లేసరికి దాదాపు అంతా నిండింది. ఒక కళ్లజోడు పిల్లాడి ప్రక్కనే కొంచెం చోటు కనబడితే, వెళ్లి నా పేరు చెప్పి, "కొంచెం కూర్చోవచ్చా?" అని అడిగాను. వాడిపేరు రాహుల్ అట. నాలాగే ఏదో కొత్త పిల్లవాడేనట! ఇంకేముంది, ఇద్దరం ఫ్రెండ్స్ అయిపోయాం! అంతలోనే టీచరుగారు వచ్చేశారు.

"గుడ్ మార్నింగ్, పిల్లలూ! నేను మీ క్లాస్‌టీచర్ శాంతను!" అన్నదావిడ, ఉత్సాహంగా నవ్వుతూ. మమ్మల్నందరినీ మా పేర్లతో బాటు ఇంకా మా గురించి ఏవైనా రెండు వాక్యాలు చెప్పమన్నది. మేం అందరం చెప్పాక, ఆవిడ బడి నియమాల్ని వివరించింది. నాకైతే ఆవిడ చెప్పే ప్రతి ముక్కా చాలా బాగా అర్థమైంది. నా భయాలన్నిటినీ ఆమె తన ఒక్క క్లాసుతో తీసేసినట్లైంది.

చూస్తూండగానే లంచ్ టైం అయ్యింది. పిల్లలందరూ జట్లు జట్లుగా చెట్ల దగ్గరికి వెళ్తుంటే, నేను, రాహుల్ కూడా అందరితో బాటు వెళ్లి చెట్ల నీడన భోంచేశాం. నేను బాగున్నాను, కానీ రాహుల్ మాత్రం ఇంకా కొంచెం బెదిరిపోయినట్లే ఉన్నాడు అప్పటికి. అన్నం తిన్నాక మేం బడంతా తిరిగి చూశాం.



ఈ బడిలో లైబ్రరీ ఎంత బాగుందో! లైబ్రరీనిండా అరలు- ప్రతి అరలోనూ నిండుగా మంచి మంచి పుస్తకాలు! బడి ఆటస్థలం కూడా భలే ఉంది. చెట్ల దగ్గరైతే ఉడతలు అటూ ఇటూ పరిగెత్తుతూ సందడిగా ఉంది.

మళ్లీ గంట కొట్టేసరికి అందరం తరగతి గదుల్లోకి వెళ్లాం. ఆ సరికి మేం ఎంత గట్టి గట్టిగా మాట్లాడటం, అల్లరి నవ్వులు మొదలు పెట్టేశామంటే, ఎవరో టీచరుగారు లోనికి తొంగి చూసి "నిశ్శబ్దంగా ఉండండి" అని చెప్పి వెళ్లారు! అది మా బడిలో మొదటిరోజు గనక, టీచర్లు టైంటేబుల్ ఇచ్చాక, పాఠాలేవీ మొదలుపెట్టలేదు.

టీచరుగారు ఒక పీరియడ్‌లో మేం అందరం సెలవల్లో ఏం చేశామో చెప్పమన్నారు. నేను మా అమ్మమ్మ వాళ్ల ఊళ్లో ఏం చేశానో చెప్పాను: ఆవు పాలు పితుకుదామని కూర్చుంటే, దాని కట్లు విప్పి ఉన్నెగద, అది నన్ను ఎట్లా తరుముకొచ్చిందో చెబితే అందరూ ఒకటే నవ్వులు!

చివరికి బడి గంట కొట్టగానే అందరం పుస్తకాలు సర్దుకొని బయటికి పరుగెత్తాం. బడి బయట మా నాన్న నిలబడి ఉన్నాడు- "అంతా బానే ఉందా?" అని ఆదుర్దాగా అడిగితే బొటనవేలు పైకెత్తి నవ్వుతూ అన్నాను- "మస్తు ఉంది!" అని.

నిజంగా మా యీ కొత్త బడి ఎంత మంచిదో! ఈ బళ్లో నేను ఈ ఒక్క సంవత్సరమేం ఖర్మ, ఎన్నేళ్లు గడపమన్నా గడిపేయగలను!


**బంధుప్రీతి!** జోకు

సీతమ్మ: రాక రాక వచ్చావు. ఈ జీడిపప్పు ఉప్మా తిని వెళ్ళొదినా!

సుభద్ర: ఈ సారి వచ్చినప్పుడు తింటాలే, అర్జంట్ పని మీద వెళ్తున్నాను.

సీతమ్మ: అప్పటి వరకు ఉండదమ్మా, ఇది పాడైపోతుంది!

*సేకరణ: సోమిరెడ్డి.*



# ధర్మదీక్ష

*"జెన్" గురువులు మాటలద్వారా కాక, తమ చేతల ద్వారా బోధిస్తారని ప్రతీతి. 'వూ-యే' గురించిన యీ కథ ఎంత వాస్తవమోగాని, ఆలోచించినకొద్దీ దీనిలో మరింత లోతుకనబడుతుందనేది మాత్రం నిజం.*

*మూలం: బుద్దిస్ట్ పారాబుల్స్ — తెలుగు కథనం: నారాయణ, కొత్తపల్లి బృందం.*

తాంగ్ వంశస్థుడైన ముచంగ్ చక్రవర్తి చైనాను పరిపాలిస్తున్న కాలంలో చైనాలో బుద్ధుని అనుయాయులు అనేక మంది ఉండేవాళ్లు. వాళ్లంతా రకరకాల ఆరామాల్లో నివసిస్తూ, మతపరమైన సాధనలు చేసుకుంటూ ఉండేవాళ్లు. ప్రభుత్వం కూడా వాళ్లను చాలా గౌరవంగా చూసేది; ఆరామాలకు, వాటిలో నివసించే భిక్షువుల అవసరాలకు ప్రభుత్వం బాగా ధనసహాయం చేసేది.

ఆ సమయంలో ఒక మారుమూల గ్రామంలో శిష్యులకు ధర్మసూక్ష్మాలు బోధిస్తూ ప్రశాంత జీవితం గడిపేవాడు, 'వు-యే' అనే ఒక గురువుగారు. ధర్మంలో ఆయన చాలా ఎదిగిన వ్యక్తి. ధర్మం పట్ల ఉన్న ఆపేక్ష

ఆయనకి డబ్బుమీదా, గౌరవాల మీదా, పదవుల మీదా ఉండేది కాదు. రాజులకు, చక్రవర్తులకు కాక సామాన్యులకు ధర్మం బోధించటం ఆయన తన పనిగా పెట్టుకొని చేస్తూవచ్చాడు.



వు-యే గారి ఖ్యాతి చక్రవర్తి వరకూ ప్రాకింది. ఆయనను రాజధానికి రమ్మని, తనను కలవమని చాలా గౌరవంగా ఆహ్వానించారు చక్రవర్తులవారు. మామూలుగా ఇలాంటి ఆహ్వానాలు ఎక్కువ మందికి అందవు. చాలా ముఖ్యమైన వాళ్లకి తప్ప, సామాన్యులకైతే చక్రవర్తిగారి దర్శనం కూడా దొరకదు. కానీ వు-యేకు ప్రాపంచికమైన ఆకాంక్షలేమీ లేవు. చక్రవర్తి రమ్మన్న ప్రతిసారీ ఆయన ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకోవటం మొదలుపెట్టాడు.

ఇలా చాలా సార్లు జరిగేసరికి, చక్రవర్తికి కోపం వచ్చేసింది. "మీదే బాధ్యత! మీరు యీసారి గనక వు-యే గురువుగారిని ఊరు వదిలి వచ్చేందుకు ఒప్పించలేకపోతే , మీకందరికీ మరణశిక్ష తప్పదు" అని చెప్పి పంపింకొందరు సైనికులను. వాళ్లు వచ్చి గురువుగారికి మొరపెట్టుకున్నారు-

"కనీసం మా ప్రాణాలు నిలిపేందుకైనా మీరు రాజధానికి రావాలి" అని కళ్ల నీళ్లు పెట్టుకున్నారు.

ఇక కాదనలేకపోయారు, వు-యే గారు."సరే, నేను పోతాను!" అన్నారు.

శిష్యులందర్నీ పిలిచారు. అందరినీ కూర్చోబెట్టి అడిగారు- "నేను పోతున్నాను. చక్రవర్తిని కలిసేందుకు వెళ్లటం మీలో ఎవరెవరికి ఇష్టమో చెప్పండి!" అన్నారు.

ఒక శిష్యుడు చేయెత్తగానే గురువుగారు అడిగారు అతనిని -"నువ్వు ఒక రోజులో ఎన్ని

కిలోమీటర్ల దూరం పోగలవు?" అని.

"యాభై" అన్నాడతను.

"సరిపోదు, కూర్చో!" అన్నారు గురువుగారు.

రెండోవాడు చెయ్యెత్తాడు. అతన్నీ అదే ప్రశ్న అడిగారు.

'అరవై ఐదు!'అన్నాడతను, గట్టిగా.

"చాలదు, కూర్చో!"

ఈసారి "డెబ్భై"అన్నాడు ఒకతను.

"ఊహుఁ సరిపోదు!" అన్నారు గురువుగారు- "అందరూ చెప్పండి- ఎవరు ఎంత వేగంగా రాగలరో చెప్పండి"

చివరికి ఒక శిష్యుడు అన్నాడు-"మీరు ఎటు వెళ్తే అటు, మీ అంత వేగంగా వస్తాను నేను, మీ వెనకే!" అని.

"సరే, అయితే!" అన్నాడు వృ-యే తృప్తిపడుతున్నట్లు.

కూర్చున్నవాడు కూర్చున్నట్లే ధ్యానంలోకి వెళ్లాడు-

అట్లా ధ్యానంలో ఉండగానే, ఒక్క క్షణంలో కూర్చున్నవాడు కూర్చున్నట్లు చనిపోయాడు!

పేరు తెలీని ఆ శిష్యుడు గబుక్కున నిలబడ్డాడు- "ఓహ్! మీరు వెళ్లారా?! నేనూ వస్తున్నాను, మీ వెంట!" అన్నాడు-

నిలబడ్డవాడు నిలబడ్డట్లే చనిపోయాడు అతను!!

సైనికులు వెళ్లి చక్రవర్తి గారికి యీ సంగతి విన్నవించుకున్నారు.

వాళ్ల ప్రాణాలకు ఏమీ కాలేదు; చక్రవర్తికి మాత్రం తక్షణం ధర్మదీక్ష లభించింది.


**మంగళం, మంగళం!!**

జోకు

సుబ్బారావు: పేపర్లో ఫోటో పడాలంటే ఏం చేయాలి?

వెంగళప్ప: ఆ పేపర్ చదువుతూ రోడ్డు దాటాలి.

*సేకరణ: సోమిరెడ్డి.*



# చలికాలం ఎలా మొదలైంది?

*ఆంగ్లమూలం: డి.పాలీ, ఫన్‌ట్రాక్, ది-హిందూ, జులై 19, 2011.*

*తెలుగు అనువాదం: నారాయణ, కొత్తపల్లి బృందం.*

ఈ ప్రపంచం అంతా మొదలైన కొత్తల్లో ఎప్పుడూ చీకటే ఉండేది; ఎప్పుడూ వెచ్చగానే ఉండేది. ఆ వెచ్చని, చీకటి ప్రపంచంలో జంతువులన్నీ చాలా సంతోషంగా జీవించేవి అన్ని జంతువులూ అంటే అన్నీ కాదు; కొయోట్ అనే పిల్లిలాంటి ఒక జంతువు మాత్రం చాలా బాధగా ఉండేది. దానికి పాపం, వేటాడటం బాగా వచ్చేది కాదు.

ఒకరోజున అది ఒక గ్రద్దని చూసింది. ఆ గ్రద్ద చాలా తెలివిగా వేటాడటం చూసి, కొయోట్ దానితో స్నేహం చేసింది- అట్లా అయినా కొంత ఆహారం తనకూ దొరుకుతుందని ఆశపడింది. ఆ రోజు సాయంత్రానికల్లా గ్రద్ద నాలుగైదు కుందేళ్లను పట్టుకున్నది, కానీ కొయోట్‌కి మాత్రం సరిగ్గా నాలుగైదు పురుగులు కూడా దొరకలేదు!

దాంతో పాపం ఆ కొయోట్‌కు సిగ్గు వేసింది. కొంచెం ఉక్రోషం కూడా వచ్చింది. "ఆ c,,

ఎంత చీకటిగా ఉందో చూడు- ఇట్లా ఉంటే నాకు ఏమి దొరుకుతుంది? కొంచెం వెలుతురు ఉండే స్థలం ఏదైనా తెలుసా, నీకు?" అని అడిగింది గ్రద్దని.




"రా,నాతో" అని దాన్ని దూరంగా ఒక స్థలానికి తీసుకుపోయింది గ్రద్ద. వీళ్లు వెళ్లేసరికి అక్కడ 'కచిన' జాతి మనుషులు కొందరు, సంప్రదాయకంగా చేసే డాన్సు చేస్తున్నారు. 'కచిన' జాతి వాళ్లంటే చాలా బలశాలులని ప్రతీతి. గ్రద్ద కొయోట్‌ను వాళ్ల దగ్గరికి తీసుకెళ్లి "చూడు, వీళ్లు వెలుతురుని రెండు పెట్టెల్లో దాచి పెట్టుకున్నారు. ఒకటి పెద్ద పెట్టె, ఒకటేమో చిన్నపెట్టె. పెద్దదాంట్లో పెద్ద మంటలాంటి బంతి ఒకటి ఉంటుంది. వాళ్లు దాన్ని 'సూర్యుడు' అంటారు. ఎప్పుడన్నా వాళ్లకు ఎక్కువ వెలుగు కావాలంటే వాళ్లు దాన్ని వాడుతుంటారు. ఇక చిన్న పెట్టెలో, పాలిపోయినట్లు తెల్లగా ఉండే బంతి ఒకటి ఉంటుంది. అది 'చంద్రుడు' -తక్కువ వెలుతురు ఇస్తుంది" అన్నది.

గ్రద్ద, కొయోట్ రెండూ మెల్లగా పొదల్లో నక్కి నక్కి వాళ్లకి దగ్గరగా పోయాయి. వాళ్లంతా నాట్యం చేసీ చేసీ అలసిపోయి పడుకున్నాక, గ్రద్ద పెద్ద పెట్టెను ఎత్తుకొని ఆకాశంలోకి ఎగిరిపోయింది. కొయోట్ మాత్రం దాన్ని అనుసరిస్తూ నేలమీద పరుగు మొదలెట్టింది.

కొంచెం సేపటికి కొయోట్ అరిచింది, గ్రద్దకేసి చూస్తూ - "ఓయ్! ఆ పెద్దపెట్టెని మోస్తూ అంత ఎత్తున, అంతసేపు ఎగిరితే అలసిపోతావు నువ్వు! కొంచెం సేపు ఆ బరువుని నాకు ఇవ్వు. నేనూ మోస్తాను" అని. గ్రద్ద దానికి పెద్ద పెట్టెను ఇస్తూ, "జాగ్రత్తరోయ్! చిలిపి పనులేమీ చెయ్యకు!" అని హెచ్చరించింది. బరువు కారణంగా కొయోట్ వేగం బాగా తగ్గింది. అది

అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తూంటే, గ్రద్ద ఎగురుకుంటూ కొంచెం ముందుకి పోయింది.

అది అట్లా కొంచెం కనుమరుగు కాగానే కొయోట్‌కి ఉత్సాహం హెచ్చింది. "పెట్టెను ఒక్కసారి-కొంచెం, కొంచెం- కొంచెమే, తెరిచి చూస్తాను!" అనుకున్నదది. "లోపల ఎంత వెలుతురు దాక్కున్నదో చూడాల్సిందే, త్వరగా! " అని.

అందుకని అది పెట్టెను క్రిందికి దించి, మెల్లగా మూతను ఎత్తింది- పాపం, దానికి తెలీదు, సులువుగా ఉంటుందని సూర్యుడిని, చంద్రుడిని- రెండిటినీ ఒకే పెద్ద డబ్బాలో కుక్కి పెట్టి తెచ్చింది గ్రద్ద! కొయోట్ మూత తెరవగానే ఒళ్లు విరుచుకొని సూర్యుడూ, చంద్రుడూ ఇద్దరూ బయట పడ్డారు! వాళ్ళు బయట పడగానే ఆ వెలుతురుకు కళ్లు బైర్లు క్రమ్మి కొయోట్ కాస్తా మూర్ఛపోయింది. మరుక్షణం సూర్యచంద్రులిద్దరూ ఆకాశంలోకి దూసుకు పోయారు!

ఆకాశంలో ఎగురుతున్న గ్రద్ద వాళ్లిద్దర్నీ పట్టుకుందామని అడ్డంవచ్చింది, కానీ అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. సూర్యుడు భూమినుంచి చాలా దూరంగా వెళ్లిపోయాడు; చంద్రుడు మరీ అంతదూరం పోకుండా, కొంచెం దగ్గర్లోనే నిలబడిపోయాడు. వాడి చల్లదనం భూమిని చేరే సరికి, భూమి మొత్తం చల్లగా అయిపోయింది! వెచ్చదనం అంతా మాయమై, వణుకు మొదలైంది. చలికి మొక్కలన్నీ ముడుచుకు పోయాయి. మంచు కురవటం మొదలుపెట్టింది. జంతువులన్నీ ఎక్కడివి అక్కడ తల దాచుకొనే చోట్లకోసం పరుగులు పెట్టాయి!

"అయ్యో, ఎంత పని చేశావురా, తిక్క కొయోట్! నీ వల్ల సూర్యుడు, చంద్రుడు తప్పించుకుపోయారు, ఇప్పుడు మన మీద ఇంత చలికాలం వచ్చిపడింది!" అని తిట్టింది గ్రద్ద. అయినా వినేందుకు కొయోట్ అక్కడ ఉంటేగా?

ఆ రోజు నుండి ప్రతి సంవత్సరమూ వస్తోంది, చలికాలం!




# అన్నదమ్ముల ఆప్యాయత

*మూలం:పర్తాప్ అగర్వాల్, స్టోరీస్ టు లివ్ బై*
*తెలుగు అనుసరణ:నారాయణ, కొత్తపల్లి బృందం.*

వెయ్యి సంవత్సరాలక్రితం చైనా దేశం నుండి యాత్రికుడొకడు భారతదేశాన్ని చూసేందుకు వచ్చాడు. ఆ రోజుల్లో మోటారు కార్లూ,విమానాలు ఉండేవి కావు. ఎంత దూరం వెళ్లాలన్నా నడిచో, బళ్లమీదో వెళ్లాలి.

చైనా యాత్రికుడు కాలినడకన ఒక ఊరి పొలిమేరలు చేరుకునే సరికి మధ్యాహ్నం అయ్యింది. అక్కడ ఒక పొలంలో పంట నూర్పిడి పని జరిగినట్లుంది- నూర్చిన పంటని రెండు కుప్పలు చేసి పెట్టి ఉన్నారు.

అందరూ మధ్యాహ్నం భోజనానికి వెళ్లారేమో, ఒక నడివయసు రైతు మాత్రం ఏదో పని మీద ఉన్నాడక్కడ.

చైనా యాత్రికుడిని చూడగానే రైతు అతన్ని పిలిచి, మర్యాదగా నులకమంచం మీద కూర్చోబెట్టి, త్రాగేందుకు నీళ్లు తెచ్చి ఇచ్చాడు. "చూడగా మీరు చాలా దూరం నుండి నడిచి వస్తున్నట్లుంది. బాగా అలసిపోయి, ఆకలిగొని ఉంటారు- ఇక్కడే, యీ మంచం మీద కొంచెంసేపు విశ్రాంతి తీసుకోండి. మాతమ్ముడు ఇప్పుడు భోజనానికి వెళ్లాడు. వాడు వెనక్కి తిరిగి రాగానే మీరు-నేను భోజనానికి వెళ్దాం. అంతవరకూ నడుం వాల్చండి" అని, తన పనిలో మునిగాడు మళ్లీ. యాత్రికుడు బాగా అలసిపోయి ఉన్నాడు. మంచం మీద విశ్రాంతిగా వాలి, భోజనం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు. ఆలోగా రైతు ఒక కుప్పలోంచి ధాన్యాన్ని తట్టతో కొద్దికొద్దిగా రెండవ కుప్పలోకి తరలిస్తూ ఉన్నాడు. కొంతసేపు చూశాక చైనా యాత్రికుడికి చిన్న అనుమానం వచ్చింది. రాను రాను ఆ అనుమానం బలపడింది.

"ముందు ఆ కుప్పలు రెండూ సమానంగానే ఉండినై. బహుశ: అవి ఈ ఇద్దరు అన్నదమ్ముల భాగాలు అయి ఉంటాయి.. మరి అందరినీ భోజనానికి పంపించి, ఈ అన్న చేస్తున్నదేమిటి?! తమ్ముడి కుప్పలోంచి ధాన్యాన్ని తన కుప్పలోకి మార్చుకుంటున్నాడు!! ఎంత మోసం?! ఎవరినీ నమ్మేటట్లు లేవు, రోజులు! అన్నే తమ్ముడిని ఇంత మోసం చేస్తుంటే, ఇక బయటివాళ్లు ఏమేం చేస్తారో.." అనుకున్నాడు. అయినా లోకం తెలిసిన-వాడూ, ఓపిక గలవాడూ కనుక అతను త్వరపడి ఒక నిర్ణయానికి రాలేదు. "వేచి చూద్దాం, కొంతసేపు!" అనుకున్నాడు.


కొంతసేపటికి తమ్ముడు తిరిగి వచ్చాడు. అతిథిని చూడగానే అతను కూడా దగ్గరికి వచ్చి పలకరించాడు. మర్యాదగా అన్నతో "నేను చాలా ఆలస్యం చేసినట్లున్నాను- అన్నా! ఈయన్ని త్వరగా ఇంటికి తీసుకెళ్లి భోజనం

పెట్టించు. చాలా అకలి అవుతూ ఉండి ఉంటుంది, పాపం! తినగానే తిరిగి రానక్కర్లేదు; కొంచెం సేపు విశ్రాంతి తీసుకొని, మెల్లగారండి. ఇక్కడి పనేదో నేను చూసుకుంటాను" అన్నాడు. అట్లా అన్న, యాత్రికుడు ఇద్దరూ ఇంటికి బయలుదేరారు.

దారిలో చైనా మనిషి అడిగాడు- "ఏమీ అనుకోకండి, మీ వ్యక్తిగత విషయాల్లో తల దూరుస్తున్నానని- కానీ మీరు ఇందాక చేస్తున్నదేమిటి? ఒక కుప్పలోంచి ధాన్యాన్ని ఇంకో కుప్పలోకి మారుస్తున్నారు కదా, ఎందుకు?" అని.

"ఓహో, అదా!?" నవ్వాడు అన్న. "ఏదో, మా ఇంటి విషయంలెండి. మా తమ్ముడూ, నేనూ ఇవాళ్ల పొద్దునే ధాన్యం పంచుకొని, పద్ధతి ప్రకారం రెండు సమానం కుప్పలు చేశాం. అయితే, వాడికి నలుగురు పిల్లలు; నాకేమో ఇద్దరే. వాడికి ఎక్కువ ధాన్యం అవసరం కదా, అందుకని నేను వాడిని ఎక్కువ కొలుచుకోమన్నాను. వాడికి ఎంత పొగరో చూడండి- తన వాటాకంటే ఒక్క సోలెడు కూడా ఎక్కువ తీసుకునేది లేదని మొండి పట్టు పట్టాడు. మరి ఇప్పుడు పంపకాలు పూర్తయిపోయాయి కదా, వాడు తినేందుకు ఇంటికెళ్లాడు; అందుకని నేను నా కుప్పలోంచి కొంత ధాన్యం ఎత్తి వాడి కుప్పలో కలిపేశాను, అదన్నమాట, చిన్న రహస్యం!" అన్నాడు.

ఈ అన్నదమ్ములిద్దరిలోనూ కనిపించిన సాహార్దత, నిజాయితీ చైనా యాత్రికుడిని ముగ్ధుడిని చేశాయి. తన దేశానికి తిరిగి వెళ్లాక తన యీ అనుభవాన్ని అతను చాలా మందితో పంచుకొన్నాడు. తను రాసిన పుస్తకంలో యీ సంఘటనను ప్రత్యేకంగా రాసి పెట్టాడు. ఆ పుస్తకం చైనాలో యీనాటికీ ఉంది!





# పులి-మనిషి

*తెలుగు జానపద కథ*

*మూలం: ఏ.కే.రామానుజన్.* *అనువాదం: నారాయణ, కొత్తపల్లి బృందం*

ఒకరోజు తెల్లవారుజామున నదిలో స్నానం చేసేందుకు బయలుదేరాడు ఒక బ్రాహ్మణుడు. ఇంకా పూర్తిగా తెల్లవారలేదేమో, అంతా మసక చీకటిగా ఉంది. అయితే అతనికి ఆ దారి అంతా కొట్టినపిండే- రోడ్డుమీద రాళ్ళు రప్పలతో సహా మొత్తం తెలుసు. అందుకని, అతను మామూలుగా వెలుతురులో నడిచినట్లు నడిచి పోతున్నాడు. ఊరుదాటి నాలుగడుగులు వేశాడో, లేదో అతనికొక గొంతు వినిపించింది-

"అయ్యా! బ్రాహ్మణోత్తమా! దేవుడిలాగా

వచ్చావు. దాహంతో నా నోరు పిడచకట్టుకు పోతున్నది. కొంచెం సాయం చెయ్యి. ఒక్కసారి నన్ను బయటికి వదులు. నీకు పుణ్యం ఉంటుంది" అని.

బ్రాహ్మణుడు ఆగి నలుదిక్కులా కలయజూశాడు. శబ్దం దగ్గరనుండే వచ్చినట్లున్నది- చూస్తే ఏమున్నది, అక్కడ?! గ్రామస్తులు పెట్టిన బోనులో చిక్కుకొని ఉన్నది, ఒక పెద్దపులి!

"పులీ, నా దగ్గర బక్కెట్టు లేదు; కనీసం చెంబుకూడా లేదు, నీకు నీళ్ళు ఇచ్చేందుకు. మరి నిన్ను వదులుదునా, అంటే ఊళ్ళో జనాలు ఇక నన్ను బ్రతకనివ్వరు నువ్వు వాళ్ళ పశువులనో, లేగ దూడలనో చంపి తిని ఉంటావు; లేకపోతే అంతకంటే తుంటరిపని మరేదైనా చేసి ఉంటావు. అందుకనే వాళ్ళు నీకోసంఈ బోను పెట్టి వెళ్ళారు. లేకపోతే ఇంత శ్రమ ఎందుకు పడతారు? ఇంకో ప్రమాదం కూడా ఉంది- నిన్ను వదలగానే నువ్వు నా మీదికి దూకి నన్నే చంపి తినేస్తావు. అందుకని నన్ను క్షమించు నాయనా, నీకు నేను ఎలాంటి సాయమూ చేయలేను" అన్నాడు బ్రాహ్మణుడు దానితో, చాలా మర్యాదగా.

"అయ్యో అయ్యో! అలా అనకు! ఒట్టేసుకొని చెబుతున్నాను- నేను ఊళ్ళోవాళ్ళ పశువును ఒక్కదాన్నికూడా చంపలేదు. నిజం దేవునికి తెలుసు- అంతెందుకు, చూస్తూండు- నన్ను చూడగానే గ్రామస్తులంతా నివ్వెరపోయి, "అయ్యో! దీనితో మాకేం పని?!" అని నన్ను విడిచిపెట్టేస్తారు. అందుకనేగద, నేను అంటున్నది- నువ్వు నన్ను కాసేపు విడిస్తే నేను అలా వెళ్ళి, కాసిని నీళ్ళు త్రాగి, మళ్ళీ వచ్చి ఈ బోనులోనే కూర్చుంటానని?! ఇక నీ భయం- అది పూర్తిగా నిరాధారమే. పరమ పవిత్రుడైన ఒక బ్రాహ్మణుడిని- అందునా నాకు సాయం చేసినవాడిని- చంపటానికి నేనేమైనా అంత తెలివి తక్కువ దాన్నా? నా అంతరాత్మమీద ప్రమాణం చేసి చెబుతున్నాను- నేను నీకు ఎలాంటి అపకారమూ చెయ్యను. నన్ను కాపాడు- నీది జాలిగుండె. నీ కళ్ళముందే ఒక మూగప్రాణి నిష్కారణంగా దాహంతో

చచ్చిపోతే నీ ఆత్మ క్షోభించదా, నన్ను ఒక్కసారి బయటికి రానియ్యి చాలు- నీ మేలు మరువను" అన్నది పులి.

ఆ సరికి బ్రాహ్మణుడు బాగా మెత్తబడ్డాడు. "మళ్ళీ బోనులోకి వెళ్ళి కూర్చుంటానని మాట ఇస్తున్నదిగదా, మరి ఇంకేమి నష్టం? పాపం నోరు లేని ప్రాణి! దాహంతో చచ్చిపోతున్నది. కాసింత సాయం చేస్తాను. కష్టాలలో ఉన్న ప్రాణులకు సాయం చెయ్యాలని శాస్త్రంకూడా చెబుతున్నది" అనుకొని, అతను వెళ్ళి, మెల్లగా బోను తలుపుకున్న గడియ తీశాడు.

అంతే! మరుక్షణం 'ధడేల్'మని తలుపును నెట్టుకొని బయటికి దూకింది పులి! ఒక్క ఉదుటున బ్రాహ్మణుడి మీద పడి, పంజాతో అతని గొంతును పట్టుకొని- "హహ్హాహ్హా! నువ్వు చాలా మంచి బ్రాహ్మణుడివే కావొచ్చు; కానీ అత్యంత మూర్ఖుడివి! అందుకనే నా చేతికి చిక్కావు. ఇప్పుడు చక్కగా దైవప్రార్థన చేసుకో, చివరిసారి- ఎందుకంటే ఇంకాసేపట్లో నేను నిన్ను తినెయ్యబోతున్నాను. నిజంగా నాకు ఇప్పుడు దాహమే కాదు, విపరీతమైన ఆకలి కూడా వేస్తున్నది!" అన్నది పళ్ళు నూరుతూ.

బ్రాహ్మణుడికి ఆక్షణంలో తను చేసినది ఎంత మూర్ఖపు పనో అర్థమైపోయింది. కానీ మొండిగా అడిగాడు దాన్ని-"ఛీ! నువ్వా ఒక పులివేనా, అసలు?! ఇంత దిగజారిన పులిని నేను ఇంతవరకూ ఎప్పుడూ చూడలేదు. ఇచ్చిన మాట మీద నిలబడలేని నువ్వు పులివి ఎట్లా అవుతావు?" అని.

పులి కొంచెం దిగి వచ్చినట్లు "మీ మనుషులందరూ మా జంతువుల్నీ, చెట్లనీ ఎంత హింసిస్తున్నారో లెక్కలేదు. అందుకని మీలాంటి వాళ్లని ఏం చేసినా పాపం లేదు. ఇది నా ఒక్కదాని అభిప్రాయమే అనుకునేవు- కానే కాదు- అందరూ ఇదే చెబుతారు. కావలిస్తే ఇటు వచ్చేవాళ్ళు ఎవరైనా ఐదుగురిని అడిగే అవకాశం ఇస్తాను నీకు. అడిగి చూడు- వాళ్ళలో ఏ ఒక్కరు నీ తరపున మాట్లాడినా నేను నిన్ను వదిలేస్తాను. అడుగు మరి" అన్నది కాలును కొంచెం వదులు చేస్తూ.

బ్రాహ్మణుడు అందుకు ఒప్పుకొని, దగ్గరలోనే

ఉన్న మామిడిచెట్టును ఒకదాన్ని న్యాయం చెప్పమన్నాడు. అది "మీ మనుషులు నిజంగానే ఆశపోతులూ, నిర్దయులూనూ. పచ్చి కసుర్లని కూడా చూడకుండా నా కాయలన్నీ కోసుకుంటారు వాళ్ళు. నా ఆకులు పీక్కుంటారు; నా బెరడుమీద చెత్త చెత్త అక్షరాలు చెక్కుతారు; నేను ముసలిదాన్నయ్యాక వచ్చి నా వ్రేళ్ళతోసహా మొత్తానీ ఎత్తుకెళ్ళి తగలబెడతారు. ఈ మనుషులకు అసలు కృతజ్ఞత అన్నదే లేదు. వాళ్లని ఏం చేసినా తప్పులేదు- వాళ్ల ప్రవర్తన అంత నీచం, నిజంగా!" అన్నది.



బ్రాహ్మణుడి ముఖం వాడిపోయింది. ఈసారి అతను ఆ దారివెంట కుంటుకుంటూ పోతున్న ఎద్దునొకదాన్ని పిలిచి న్యాయం చెప్పమన్నాడు. "మనుషులకి అసలు జాలి అన్నదే లేదు. పూర్తిగా స్వార్థపరులు వాళ్ళు. నా జీవితం అంతా వాళ్ళు నాచేత ఊడిగం చేయించుకున్నారు. అలసిపోయి ఏ కొంచెం ఆగినా, నన్ను తిట్టారు; కొట్టారు; ఇంకా ఇంకా పని చేయించుకుంటూనే పోయారు. ఇప్పుడు, నేను ముసలిదాన్ని అయ్యాక, నా కాళ్లలో బలం తగ్గి కుంటిదాన్నయ్యాక, నన్ను తన్ని తగలేశారు. మనుషుల గురించి చెప్పేందుకు నాదగ్గర ఒక్క మంచిమాటకూడా లేదు" అన్నదది.

బ్రాహ్మణుడు అటే వస్తున్న ఓ ముసలి ఆవును అడిగాడు ఆశగా. అదికూడా మనుషుల్ని బాగా తిట్టింది- 'వాళ్లని ఏం చేసినా తప్పు లేదు' అన్నది.

అంతలో ఒక గాడిద వచ్చిందక్కడికి, గెంతుకుంటూ. ఎందుకంటే దాని ముందరి కాళ్ళు రెండింటినీ కట్టేసి పెట్టాడు, దాని యజమాని! ఇక అది మనుషుల గురించి ఏం చెబుతుందో ఎవరైనా ఊహించుకోవచ్చు.

బ్రాహ్మణుడు ఇంకా తటపటాయిస్తూ ఉండగానే పులి దాన్ని పిలిచి అడిగేసింది- మనుషులకోసం దాని దగ్గర ఒక్క మెప్పుకోలు కూడా లేదు- మనుషులు ఎంత క్రూరులో ఏకరువుపెట్టింది అది.

పులి బ్రాహ్మణుడిని చూసి "ఇప్పుడేమంటావు నువ్వు? మీ మనుషులు మా పట్ల ఎంత నిర్దయతో ప్రవర్తిస్తున్నారో అర్థమైంది గదా, ఇక నేను నిన్ను తినచ్చునా?" అన్నది.

అంతలోనే తడుముకుంటూ వెళ్తున్న ముసలి నక్క ఒకటి దాని కంట పడింది. "సరే, నేను నీకు ఇంకో అవకాశం కూడా ఇచ్చేస్తాను- ఐదో సాక్షి ఇటే వస్తున్నది. దాన్ని ఒక్కదాన్నీ అడిగేస్తే నీ పని అయిపోతుంది; అడిగెయ్, దాన్ని!" అన్నదది తొందరపెడుతూ.

ఆ సరికి బ్రాహ్మణుడి ఆశలన్నీ అడుగంటి పోయాయి. అయినా ఏం చేయగలడు, పాపం ఇదే చివరి అవకాశమాయె!

నక్కని దగ్గరికి రమ్మని అరిచింది పులి. నక్క వచ్చింది, అడుగులో అడుగు వేసుకుంటూ. ముసలితనం వల్ల దానికి కళ్ళు సరిగా కనిపించటం లేదు; అయినా అది చాలా తెలివైనది- పరిస్థితినంతా క్షణంలో ఆకళింపు చేసుకున్నది: మనిషి తరపున ఏ కొంచెం మాట్లాడినా పులికి కోపం వస్తుంది- అందుకని ఎవ్వరికీ అసలు నిజం చెప్పే అవకాశం లేనే లేదు-"



అందుకని అది అన్నది "మనుషుల క్రూరత్వాన్ని గురించి నేను కూడా చాలా చెబుతాను. అయితే అసలు ఇక్కడ ఏం జరిగిందో నన్ను ఓసారి అర్థం చేసుకోనివ్వండి ముందు- ముసలితనం కదా, నా మెదడు చురుకుగా ఉండటం లేదు. పైపెచ్చు నా చూపుకూడా సరిగా ఆనటం లేదు ఇప్పుడు. అందుకని దయచేసి ఇక్కడేం జరిగిందో

చెప్పండి మెల్లగా- ఆపైన నేను అడిగే ప్రశ్నలు కొన్నిటికి ఓపికగా జవాబులివ్వండి" అని.

ముందుగా బ్రాహ్మణుడు తను స్నానానికి వెళ్తున్న సంగతీ, పులి పిలిస్తే బోను దగ్గరికి వెళ్లిన సంగతీ, దానిమీద జాలితో తను పులిని విడిపించిన సంగతీ, ఇప్పుడు అది తననే తినెయ్యాలని అనుకుంటున్న సంగతీ చెప్పాడు దానికి.

పులికి ఓపిక బాగా తగ్గిపోయింది. అది మొరటుగా పళ్ళు నూరుతూ "ఇంక చెప్పెయ్ అల్లుడూ! మనుషులంటే నీకు ఎంత అసహ్యమో త్వరగా చెప్పెయ్! నాకు చాలా ఆకలిగా ఉంది!" అంటూ నక్కని తొందర పెట్టింది.

నక్క తల గోక్కున్నది; పులివైపుకు తిరిగి "మామా! నీకు కోపం కలిగించే మాటలేమీ అనను గానీ, ముందు నాకో సంగతి చెప్పాలి నువ్వు. నీ అంత పెద్ద జంతువు ఇంత చిన్న బోనులో ఎలా పడుతుంది? నిజానికి నువ్వు ఆ బోనులో ఉన్నావన్న సంగతే మింగుడు పడటం లేదు నాకు. ఓసారి చూపించు, ఒక్క క్షణం చాలు- నువ్వు అందులోకి ఎట్లా దూరావు, ఆ గడియ ఎట్లా పడింది?" అన్నది.

పులికి ఓపిక నశించి, కోపం వచ్చేసింది. "నీ అంత ముసలి తొక్కనూ, ఇంత తెలివిలేని నక్కనూ నేను ఎన్నడూ చూడనేలేదు. నేను అందులో ఎలా దూరానో నీకెందుకు ఇప్పుడు? అయినా నీతో మాట్లాడితే మరింత ఆలస్యం అవుతుంది తప్ప, వేరే ప్రయోజనం ఏమీ ఉండదు. అందుకని చూపిస్తాను- చూడు- బోను తలుపు తెరిచి ఉన్నదిగదా, ఇట్లాగ? నేను ఇట్లా వెళ్ళాను లోపలికి!" అని చటుక్కున బోనులోకి దూరింది. ఇంకా దాని మాటలు పూర్తవ్వకుండానే బోను తలుపు మూసుకుపోయింది; గడియపడిపోయింది! మాటలన్నీ గొంతుకు అడ్డం పడటంతో పులి కాస్తా బిత్తరపోయింది!

నక్క నవ్వుతూ బ్రాహ్మణుడివైపుకు తిరిగి-"ఇప్పుడు పో స్వామీ, నువ్వు పోయి నీ స్నానం కానివ్వు!" అన్నది. బ్రాహ్మణుడు నక్కకు ధన్యవాదాలు అర్పించుకుంటూ 'బ్రతుకు జీవుడా' అని పరుగుపెట్టాడు! 

# పదరంగం-7

*ఈ పదరంగం చాలా సులభం! దీన్ని పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-8 తో పాటు ప్రచురించగలం.*

*నిర్వహణ: దేవి, కొత్తపల్లి బృందం.*

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | 4 |
| | | 5 | 6 | | |
| | | 7 | | | |
| | 8 | | 9 | | 10 |
| 11 | | | | | |
| 12 | | | | | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. సమాధానం (3)
3. రమ్మని రెండు సార్లు పిలు! (2)
5. రచనలు చేసేవాడు (4)
7. దగ్గర (2)
9. రాక్షసుడి చెల్లి (3)
11. ఇనుప వస్తువులను ఆకర్షించేది (4)
12. రోజు (2)

**నిలువు:**

1. రక్తం పీల్చుకునే పురుగు (3)
2. వానా కాలంలో కాళ్లకి అంటుకునేది (3)
3. రాళ్ళు- ఏకవచనం (2)
4. 'వ్రాత'ని ఇలా రాస్తారు (2)
6. గజిబిజిగా 'రామచరితం' (5)
8. ప్రయాణం (3)
10. చలనచిత్రం (2)
11. ఇది కాదు (2)

**పదరంగం-6 కి సరైన సమాధానం**


| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 సు | వా | 2 స | న | | 3 కుం |
| బు | | మ | | 4 ప | దే |
| ష్రి | | 5 పం | 6 ప | కా | లు |
| | 7 రా | | శ్చా | | |
| 8 వా | | 9 అ | త్తా | | 10 గు |
| 11 న | త్తి | | 12 పం | ది | రి |

దీనికి చక్కగా సమాధానాలు వ్రాసి పంపించిన పిల్లలు:

1. నందన ఏ.యస్, 4 వ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.
2. అసంగానంద రెడ్డి, 4 వ తరగతి, అజంతా స్కూల్, నెల్లూరు.
3. జి.సత్యలక్ష్మి, 2 వ తరగతి, ఇంటి బడి, చెన్నేకొత్తపల్లి.

# సమీక్ష

*కొత్తపల్లి పత్రిక ఆగస్టు 2011 సంచిక సమీక్ష...*
*నిర్వహణ: శ్రీమతి మాలతీకృష్ణ, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.*




చాలా ఏళ్ళ క్రితం జరిగిన కుంభమేళాలో చాలా మంది వయసు మళ్ళినవారు- ఎక్కడెక్కడినుంచో వచ్చినవారు- దిక్కుతోచని స్థితిలో ఉండటం గమనించారట పోలీసులు. వాళ్ళని రక్షణలోకి తీసుకొని ప్రశ్నిస్తే, కళ్ళు తిరిగే నిజం ఒకటి బయటపడింది: వాళ్లంతా సొంతగా అక్కడికి రాలేదు! వాళ్లని ఎలా వదిలించుకోవాలో తెలీక, పవిత్రస్నానాలకని చెప్పి తీసుకొనివచ్చి, అక్కడే వదిలేసి వెళ్లిపోయారట, వాళ్ళ పిల్లలు! 'రంగయ్య గాడిద' కథ చదువుతుంటే ఆ విషయం గుర్తు కొచ్చింది. మనిషి ఎంత నిర్దయుడు!

హర్షవర్ధన్ వాళ్ల అమ్మ చెప్పిన కథ చాలా కొత్తగా ఉంది. తాత సమయస్ఫూర్తి బాగుంది. శైలి చక్కగా, చదివించేలా ఉంది.

పిల్లాడితో నమస్కారం పెట్టించుకోవటంకోసం చిన్నారిగారు అనుసరించిన పద్ధతిలో కొంత అతిశయం ఉందేమోగాని, 'పిల్లలకు మనం ఏది ఇస్తామో దాన్నే తిరిగి పొందుతాం' అనే సత్యం దాగి ఉంది అందులో. గౌరవమే కాదు- ప్రేమ, మర్యాద, ద్వేషం- ఏదైనా అంతే.

'రాణి కడుపులో చేప' బాగుంది. ఎంత బంగారందైనా, బావిలో బ్రతుకు దుర్భరమే కదా. స్వేచ్ఛకి దూరం చేసి సకల సౌకర్యాలను ఇచ్చినా ఎంత వృధా! చేపకు అందరిమీదా అక్కసు కలగటం తప్పుకాదనిపించింది.

'ఎగిరిన నక్క' వేరే రకంగా చదివినదే. కానీ నక్కలకి పిట్టలంటే అందుకు కోపమని మాత్రం ప్రగతి చెప్తేనే


తెలిసింది. ఇంతా చేసి, చివర్లో కూడా పిట్టపైనే కోపం పెంచుకున్నది గానీ, తన కాలు విరగటానికి కారణం తన మూర్ఖత్వం అని గుర్తించనే లేదు నక్క- దానికి నిజంగా బుద్ధి వచ్చిందంటావా, ప్రగతీ?

సంపాదకీయంలో స్వాతంత్ర్యం గురించి, బాపూజీ గురించి, సాదా- సీదాగా, క్లుప్తంగా, మరెంతో సూటిగా చెప్పిన తీరు చాలా బాగుంది- కొత్తపల్లి మార్కుతో! స్వాతంత్ర్య దినోత్సవంనాడు పిల్లలకి చెప్పదగినది అంతకంటే మంచిది మరోటి లేదనిపించింది. 'బానిసత్వంలో ఉన్నామని గుర్తించటంలోనే స్వాతంత్ర్యపు బీజాలున్నాయి' నిజంగానే. అలా గుర్తించలేకపోవటం, గుర్తించినా మభ్యపెట్టుకొని బ్రతికెయ్యటం, ఆ బానిసత్వంలోనే సుఖం వెతుక్కోవటం- ఇదే సమస్య. అట్టమీద బాపూజీ సజీవమైన తేజస్సుతో దర్శనమిచ్చాడు, హుందాగా. చిత్రకారుడు వీరాంజనేయులుకి మరోసారి అభినందనలు.

మనం చెప్పుకునే కథలు ఏవైనా, వేటికవి ఓ ప్రత్యేకమైన కాలానికీ, నేపథ్యానికీ చెందినవై ఉంటాయి. ఆ కాలాన్ని బట్టీ, పాత్రల స్వభావాన్ని బట్టీ కథలో వాడే పదాలు ఉండాలి. కొత్తపల్లిలో అలాంటి తప్పులు అసలు ఉండకపోతేనే బాగుండనిపిస్తుంది: నీతిచంద్రికలో 'రేటు', రాజుల కాలంనాటి 'రాణికడుపులో చేప' కథలో 'లేటు' లాంటి పదాలను చూసినప్పుడు. ఆ కథల సహజత్వమే దెబ్బ తిన్నట్లు అనిపిస్తుంది. అలాగే బొమ్మలు కూడాను- విశ్వనాథ రాసింది రాజుల నేపథ్యంలోని కథ- మరి ఆ కథలో వ్యాపారి కొడుకులు ప్యాంటు షర్టులు వేసుకున్నారేమి? అలాగే నమస్కారం కథ పల్లెటూరికి సంబంధించినది- అందులో పిల్లలేమో కార్గో ప్యాంట్లు, పోలోనెక్ టీ షర్టులు వేసుకొని మోడ్రన్‌గా ఉన్నారు! ఈ విషయంలో మరికాస్త శ్రద్ధ వహించాలి. అట్లాగే దయ్యాల్నీ, రాక్షసుల్నీ నేనైతే ప్రత్యక్షంగా ఎన్నడూ చూడలేదుగానీ, సాంప్రదాయ చిత్రణ ప్రకారం రెండూ వేరు వేరే. మరి 'మంగయ్య తెలివి'లో ఉన్నది దయ్యమా, రాక్షసా?

వెనక అట్టమీది అనురాగ్ వేసిన బొమ్మల కథ నాకైతే అర్థం కాలేదు నిజంగా. దాని కొనసాగింపు కూడా ఉన్నదట, చూడాలి- అబ్బ, పిల్లలు! వాళ్ళ ఊహలు ఊహలు కావు!

'మంచి పుస్తకం' లో చెప్పిన 'ఇట్లు నాన్న'ని వెంటనే చదవాలి. నెలనెలా ఓ మంచిపుస్తకాన్ని పరిచయం చేస్తున్న మామంచి పుస్తకం కొత్తపల్లికి అభినందనలు, ధన్యవాదాలు!



# తరలిపో!

*రచన, స్వరకల్పన: శ్రీసూరి కుమారస్వామి గారు, విజయవాడ.*

*గానం: బాలాదిత్యసూరి, బాలచంద్రసూరి, విజయవాడ.*

(*దాదాపు పదిహేను సంవత్సరాల క్రితం ఈ పాట పాడినప్పుడు వీళ్ళిద్దరూ* 6, 7 *తరగతుల్లో ఉన్నారు*)

తరలిపో, తరలిపో, తరలిపో!

తరలిపో, తరలిపో, తరలిపో!

ఆ చల్లని కోనలోకి - ఆ పచ్చని కానలోకి

తరలిపో, తరలిపో, తరలిపో!

మరలనుండి రొదలనుండి మరలిపో

మరబ్రతుకుల వెతలనుండి మరలిపో
మరలిపో మరలిపో!
తరలిపో, తరలిపో, తరలిపో!


అటప్రతి మలుపూ హరిత రాగసంచారం
అటప్రతి తరువూ నవ వసంత దరహాసం
కొండమోముపై జారును మేలిముసుగు తుషారం
కోనలలో జాలువారు నీల మేఘ మల్హారం
ఆ చల్లని కోనలోకి - ఆ పచ్చని కానలోకి
తరలిపో, తరలిపో, తరలిపో!
మరలనుండి రొదలనుండి మరలిపో
మరబ్రతుకుల వెతలనుండి మరలిపో
మరలిపో మరలిపో!
తరలిపో, తరలిపో, తరలిపో!

వెండివాగు పలికించును జలతరంగిణి
వేణుకుంజమాలపించు రాగరాగిణి
నింగినంటు తరులలో వాయులీన హేల
లోయలలో పరచుకున్న మౌనస్వరమేళ
ఆ చల్లని కోనలోకి - ఆ పచ్చని కానలోకి
తరలిపో, తరలిపో, తరలిపో!
మరలనుండి రొదలనుండి మరలిపో
మరబ్రతుకుల వెతలనుండి మరలిపో
మరలిపో మరలిపో!
తరలిపో, తరలిపో, తరలిపో!

ఈ పుస్తకంలోని పాటలన్నిటినీ మీరు ఇంటర్నెట్లో వినే వీలున్నది!
సందర్శించండి: http://kottapalli.in

# టిక్ టిక్ టిక్

*రచన, గానం: "కవికాకి" కీ.శే.జైసీతారాం, కోగిర, రొద్దం మండలం, అనంతపురం జిల్లా.*



టిక్ టిక్ టిక్ టిక్ గడియారం

పుట్ పుట్ పుట్ పుట్ మోటారు బైక్

కుట్ కుట్ కుట్ కుట్ కుట్టు మిషన్

పట పట పట పట టైప్ రైటర్

బుర్రు బుర్రు బుర్రు బుర్రు మోటారు బస్

గణ గణ గణ గణ బడిగంట!

**వెల:**
ప్రతి ఒక్కింటికి: 20 రూ.
12 పుస్తకాలకై చందా: 240 రూ.

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust",
A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670
ఇ-మెయిలు: team@kottapalli.in

**<u>ఈ నెలలో ఏపని-ఎవరిది?</u>**

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు
సంపాదకత్వం: నారాయణ
వెబ్సైటు, సమాచార సాంకేతికత: ఆనంద్
ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు
చిత్రాలు: వీరాంజి, అడవిరాముడు, శివ, వాసు, ప్రసాద్, వెంకట్, రాము, మహేశ్, లక్ష్మి, జ్యోతి,
చిలిపి ప్రశ్నలు: వివియస్ మూర్తి.
బొమ్మకు కథ: జి.లలిత, telugu4kids
సమీక్ష: వై.మాలతి. పదరంగం: దేవి
కథలు, పాటలు: చాలామంది పిల్లలు

**<u>ప్రత్యేక కృతజ్ఞతలు:</u>**
కార్టూన్ల వివియస్ మూర్తి గారికి, ఋషివ్యాలీ స్కూల్లో ఏడవ తరగతి చదివే సాక్షి జోషికి, ప్రకృతి బడికి, విద్యార్థి సృజన కుటీరానికి, telugu4kidsవారికి, మాలతీ కృష్ణగార్లకి, రాధ రాజశేఖర్ గార్లకి, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

ఇంటర్నెట్‌లో http://kottapalli.in వద్ద కొత్తపల్లి పత్రికను చదవండి.

అందరు పిల్లల కోసం మీరూ కథలు రాసి పంపండి.

చందాదారులుగా చేరి నెల నెలా కొత్తపల్లిని పోస్టులో మీ ఇంటికి తెప్పించుకోండి.

మీ మిత్రుల తరపున చందాలు కట్టండి.

మీకిష్టమైన బడులకు, గ్రంథాలయాలకు కొత్తపల్లిని బహూకరించండి.

# ఏకీకరణం!

అనగా అనగా ఒక ఊరు.

ఆ ఊళ్ళో అందరూ **క** భాష మాట్లాడతారు. ప్రక్క ఊళ్ళో అందరూ **చ** భాష మాట్లాడతారు.

కొందరు తెలివైన వాళ్ళు **క** భాషా మాట్లాడే వాళ్ళు; **చ** భాష కూడా మాట్లాడేవాళ్ళు. వాళ్లని అందరూ గౌరవించేవాళ్ళు.

ఆ ఊరి ప్రక్కన ఇంకో ఊరుండేది. ఆ ఊళ్ళో అందరూ **ట** భాష మాట్లాడేవాళ్ళు.

కొందరు తెలివైనవాళ్ళు **క** భాషా మాట్లాడే వాళ్ళు; **చ** భాషా మాట్లాడేవాళ్ళు; **ట** భాష కూడా మాట్లాడేవాళ్ళు. వాళ్లని అందరూ ఇంకా చాలా గౌరవించేవాళ్ళు.

ఇట్లా ఒకదాని ప్రక్కన ఒకటి, వేరు వేరు భాషలు- **క** నుండి **ఱ** వరకూ- మాట్లాడుకుంటూ ఒక పధ్నాలుగు ఊళ్ళు ఉండేవి. పధ్నాలుగు భాషలూ వచ్చిన వాళ్ళకి అందరికంటే ఎక్కువ గౌరవం దొరికేది.

అయితే అవన్నీ నేర్చుకునేసరికి వాళ్ళు పాపం, ముసలివాళ్ళు అయిపోయేవాళ్ళు!

వాళ్లంత తెలివైనవాళ్ళు కావాలని పధ్నాలుగు ఊళ్ళ జనాలూ వాళ్ళ పిల్లల్ని పోరటం మొదలు పెట్టారు. ఎంత వేగంగా చదివినా, మొత్తం పధ్నాలుగు భాషలూ వచ్చేసరికి ముసలివాళ్ళు అయిపోతారు కదా?! అందుకని ఆ పని ఎవ్వరికీ ఇష్టం లేకపోయింది.

చివరికి ఈ పధ్నాలుగు ఊళ్ళకీ అవతల ఉన్నవాడికెవరికో ఒక ఐడియా వచ్చింది:

వాడొక **ఇ** భాషని కనుక్కొని, దాన్ని ప్రచారం చేశాడు: "**ఇ** భాష చాలా సులభం. అది **క** భాష వాళ్లకీ సరిపోతుంది, **ఱ** భాష వాళ్ళకీ సరిపోతుంది. ఎవరికి వాళ్ళు, వాళ్ల భాషతోపాటు **ఇ** భాష నేర్చుకుంటే సరి! "

అందరికీ ఆ పద్ధతి నచ్చింది. దాంతో ఏ ఊరివాళ్ళు ఆ ఊళ్ళో కూర్చొని, వాళ్ల భాష, దాంతోపాటు **ఇ** భాష నేర్చుకోవటం మొదలుపెట్టారు.

కొన్నాళ్లకు పధ్నాలుగు భాషలూ వచ్చినవాళ్ళంతా చచ్చిపోయారు. మెల్లగా 13 భాషలు వచ్చిన వాళ్ళూ పోయారు. 12 భాషల వాళ్ళూ పోయారు. అట్లా చివరికి రెండు భాషల వాళ్ళే మిగిలారు అంతటా.

కొంత కాలం గడిచిన తర్వాత కొందరు తెలివైన వాళ్ళు అనుకున్నారు- "రెండు రెండు భాషలు నేర్చుకోవటం కష్టంగా ఉంది, ఒక్క **ఇ** భాష ఉంటే చాలు గదా" అని!

ఆ విధంగా కొన్నేళ్ళ తర్వాత పధ్నాలుగు భాషలూ చచ్చిపోయాయి; ఒక్క **ఇ** భాషే మిగిలింది!!


పధ్నాలుగు ఊళ్ళకీ అవతల బంగళా కట్టుకొని కూర్చుని అందరికీ తన భాషను నేర్పిస్తున్న **ఇ** భాష వాడు అప్పుడు నవ్వుకున్నాడు, వీళ్లందరినీ చూసి.


మీకు తెలుసా, ఇలా ప్రపంచం మొత్తం మీద ఈ సరికి 2000 కి పైగా భాషలు చచ్చిపోయాయట, నిజంగా!!

Edited, Typeset and Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in

మంచి పుస్తకం


# అజంతా అపార్టుమెంట్స్





ఇప్పుడిప్పుడే తెలుగు చదవటం నేర్చుకుంటున్న చిట్టి పిల్లల కోసం ఎలీనా వాట్స్ రాసిన ఎనిమిది చిన్న కథల పుస్తకాల సంపుటం, ఈ అజంతా అపార్ట్‌మెంట్స్.

ఈ కథలను చదివిస్తే పిల్లలు నిజంగానే ఆనందిస్తారు. ఇక పెద్ద పిల్లలైతే వీటిని తమంతట తామే చదువుకోగలరు.




ఇందులో ఉండే గణేశ్, సయీఫ్, మన్‌దీప్, అమిత్, జ్యోతి, మదన్, అస్మినాలు అందరికీ తెలిసినపిల్లలే- మనందరి మిత్రులే!

రచన: ఎలీనా వాట్స్

అనువాదం: స్నేహ, అమృత్

ప్రచురణ: మంచిపుస్తకం

వెల: ఒక్కొక్కటీ 18 రూపాయలు







